
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు బేడీ ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు కుటుంబ సభ్యులు -తిరుమల, సెప్టెంబరు 24 వార్తాప్రభ) :


| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 184 | ది. 25-9-2025 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 184 | Date : 25-9-2025 | Thursday | Pages : 8 | Rs.1/- |


## అమ్మవారి ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో సాగాలి

- అమ్మవారిని దర్శించుకోవడం దివ్యమైన అనుభూతి
- దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో విజయవాడ ఒకటి
- భారత ఉపరాష్ట్రపతి శ్రీ సిపి రాధాకృష్ణన్





**విజయవాడ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** దసరా శరన్నవరాత్రులలో మూడవ రోజు అయిన బుధవారం అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారిని భారత ఉపరాష్ట్రపతి శ్రీ సిపి రాధాకృష్ణన్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఉపరాష్ట్రపతికి రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర, దుర్గగుడి ఈవో శీనా నాయక్ స్వాగతం పలికారు. ఉపరాష్ట్రపతి క్యూలైన్లలోని భక్తులకు అభివాదం చేస్తూ మహా మండపానికి చేరుకున్నారు. అక్కడ ఉపరాష్ట్రపతి దంపతులకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి సన్నిధికి చేరుకొని అన్నపూర్ణ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితులు వేదాశీర్వచనం చేయగా, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఈవో శీనా నాయక్ ఉపరాష్ట్రపతికి అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**అనంతరం ఉపరాష్ట్రపతి మీడియాతో మాట్లాడుతూ....** అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకోవడం దివ్యానుభూతి అని చెప్పారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో విజయవాడ ఒకటని చెప్పారు. రాష్ట్రం అద్భుతమైన వృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలందరికీ దసరా నవరాత్రుల శుభాకాంక్షలు తెలియజేశారు.

## మెడికల్ విద్య విస్తరణకు గ్రీన్ సిగ్నల్

### ఎంబీబీఎస్, పీజీ సీట్ల పెంపుకు కేంద్ర కేబినెట్ ఆమోదం



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** కేంద్ర ప్రభుత్వం దేశంలో వైద్య విద్యను విస్తరించేందుకు ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. ప్రధాని, నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయానికి ఆమోదం లభించింది. దీని ద్వారా ఎంబిబిఎస్ సీట్లను 5,023, పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లను 5,000 లకు పెంచనున్నారు. ఒక్కో సీటుకు ఖర్చు పరిమితిని 1.50 కోట్ల రూపాయలకు పెంచారు.ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులను ఆధునికీకరించడానికి, బలోపేతం చేయడానికి కేంద్ర ప్రాయోజిత పథకం ద్వారా సహాయం అందించనున్నారు. 2025-26 నుండి 2028-29 వరకు ఈ పథకాల కోసం 15,034.50 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు. ఇందులో కేంద్రం 10,303.20 కోట్లు, రాష్ట్రాలు 4,731.30 కోట్లు భరిస్తాయి. ఈ నిర్ణయంతో వైద్య విద్యను చదివే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయి. వైద్యులు, నిపుణుల సంఖ్య పెరుగుతుంది. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణ మెరుగుపడుతుంది. వైద్య విద్య, శిక్షణ నాణ్యత ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుంది. ఈ పథకాలు వైద్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, పారామెడికల్ సిబ్బంది వంటి వారికి ఉపాధి అవకాశాలను కల్పిస్తాయి. దేశంలో ఆరోగ్య వ్యవస్థ బలోపేతం అవుతుంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆరోగ్య సౌకర్యాలు మెరుగవుతాయి. సమాజం, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది.

## మెగా డిఎస్సీ వేడుకకు ఎమ్మెల్యేలంతా హాజరుకావాలి

### -శాసనసభ్యులకు మంత్రి నారా లోకేష్ ఆహ్వానం



**అమరావతి,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు మెగా డిఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారు, దీనిద్వారా సుమారు 16వేలమందికి టీచర్ ఉద్యోగాలు రాబోతున్నాయని మంత్రి నారా లోకేష్ చెప్పారు. గత అయిదేళ్లలో ఒక్క డిఎస్సీ ఏర్పాటుచేయలేదు. నోటిఫికేషన్ దగ్గర నుంచి ఎగ్జామ్స్, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ వరకు ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాం. రేపు కొత్త ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతులమీదుగా నియామక ఉత్తర్వులు అందించబోతున్నాం. ఇది కూటమి ప్రభుత్వానికి గర్వకారణం. ఎమ్మెల్యేలంతా హాజరై జయప్రదం చేయాల్సింది కోరుతున్నాం. ప్రతిపక్ష సభ్యులకు కూడా జిఎడి ద్వారా ఆహ్వానం పంపించాం. ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా వారిని కూడా కోరుతున్నామని మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. మెగా డిఎస్సీని అడ్డుకునేందుకు వైసిపి వారు సుమారు వందకు పైగా కేసులు వేశారు. పకడ్బందీగా నోటిఫికేషన్ ఇవ్వడంతో ఒక్క స్టే కూడా రాలేదు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ పూర్తిచేశాం. రేపు సచివాలయం వెనుక వైపు నిర్వహించే భారీ కార్యక్రమానికి టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతోపాటు వారి కుటుంబసభ్యులు కలిసి సుమారు 32వేలమంది హాజరుకాబోతున్నారు. వేదిక వద్ద ప్రతిజిల్లాకు ఒక్కొక జోన్ ఏర్పాటుచేశాం. ఆయా జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు హాజరై సంబంధిత జోన్లలో కూర్చోవాల్సిందిగా కోరుతున్నాం. స్థలాభావం వల్ల అందరికీ బస్సులు ఏర్పాటుచేశామని చెప్పారు. శాసనమండలి డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు స్పందిస్తూ... డిఎస్సీ విషయంలో మంత్రి లోకేష్ కృషికి అభినందనలు తెలిపారు. ప్రతిపక్షాలు కూడా విమర్శలు చేసే అవకాశం లేకుండా ఎంపిక ప్రక్రియ పూర్తిచేశారని ప్రశంసించారు.

## మనం ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టించగలరు

### -'డేర్ టూ డ్రీమ్' శిబిరం ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** యువతలో అపారమైన శక్తి, సామర్థ్యాలు ఉన్నాయని, వారిని మనం ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టించగలరని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలం గాణ సిఖ్ సొసైటీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా తూంకుంటలోని అలంకృత రిసార్ట్‌లో 'డేర్ టూ డ్రీమ్' పేరిట సిఖ్ యువత కోసం ఏర్పాటు చేసిన నాలుగు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఆలోచనలకు, ఆకాంక్షలకు పరిమితులు పెట్టుకోవద్దని ఈ సందర్భంగా యువతకు దిశా నిర్దేశం చేశారు. కలలు కనడం ఎంత ముఖ్యమో, వాటిని సాకారం చేసుకునేందుకు కష్టపడటం కూడా అంతే ముఖ్యమన్నారు. గెలుపోటముల గురించి ఆలోచించొద్దని, లక్ష్యాన్ని చేరుకునే వరకూ పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నించాలని సూచించారు. కృషి, పట్టుదల లేకుండా ఏ కల సాకారం కాదన్నారు. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా, నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సిఖ్ సొసైటీ ప్రతినిధులు తేజ్ దీప్ కౌర్, గగన్ కోహ్లీ, సురేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## తగ్గేదేలే.. వదిలేదే లే..

### ప్రతీకారంతో జగన్ మరో సంచలనం..



**తాడేపల్లి,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** ఏపీలో విచిత్ర రాజకీయాలు నడుస్తున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని టీడీపీ కూటమి టార్గెట్ చేస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను బయటపెట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలు శాసనసభకు హాజరుకు సంబంధించి ఆసక్తికర అంశాలు తెరపైకి వచ్చాయి. కొందరు వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరుకాకుండానే రిజిస్టర్లో సంతకాలు పెడుతున్న విషయం చర్చకు వచ్చింది. అటువంటి వారిపై వచ్చే సమావేశాల నాటికి అనర్హతా వేటు వేస్తారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఈ రోజు తాడేపల్లిలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో జగన్ సమావేశం నిర్వహించారు. టీడీపీ రెడ్ బుక్ మాదిరిగానే డిజిటల్ బుక్ ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు.

**అప్పట్లో లోకేష్ రెడ్ బుక్..** టీడీపీ విపక్షంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలను వెంటాడింది వైసీపీ ప్రభుత్వం. చివరకు కుప్పంలో చంద్రబాబును సైతం విడిచిపెట్టలేదు. యువగళం ప్రారంభించిన లోకేష్ కు అడుగడుగునా చుక్కలు చూపించారు. అయినా వెనక్కి తగ్గని లోకేష్ ఒక రెడ్ బుక్ తో కనిపించేవారు. ఈ క్రమంలో యువగళం ముగింపు సభలో రెడ్ బుక్ పై ఫుల్ క్లారిటీ ఇచ్చారు. వైసీపీ హయాలో టీడీపీ శ్రేణులను ఇబ్బందిపెట్టిన ప్రతిఒక్కరి పేర్లు రాసుకుంటున్నానని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రెడ్ బుక్ కు ఎనలేని ప్రాధాన్యం దక్కింది. ఎందుకంటే వైసీపీ నేతల వరుస అరెస్టులుతో రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైసీపీ ఆరోపించడం ప్రారంభించింది.

**డిజిటల్ బుక్ ఆవిష్కరణ..** అయితే రెడ్ బుక్ మాదిరిగా మనం కూడా ఒక బుక్ రాసుకొందామని వైసీపీ నేతలు కోరడంతో డిజిటల్ బుక్ ప్రారంభించారు జగన్. ఈ రోజు తాడేపల్లిలో పార్టీ నాయకుల సమావేశంలో డిజిటల్ బుక్ ను ఆవిష్కరించారు జగన్. ప్రతిఒక్కరి వివరాలు డిజిటల్ బుక్ లో రాయాలని.. ఆధారాలుంటే నమోదు చేయాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సప్త సముద్రాల అవతల ఉన్నా తెచ్చి శిక్షిద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తగ్గేదేలే..వదిలేదిలే అంటూ తేల్చిచెప్పారు. వైసీపీ కార్యకర్తల జోలికి వచ్చిన వారిని విడిచిపెట్టమని హెచ్చరించారు. జగన్ హెచ్చరికలను వైసీపీ సోషల్ మీడియా విభాగం వైరల్ చేస్తోంది.

## రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులందరికీ వృతి నైపుణ్య శిక్షణ ఇప్పించండీ

- ప్రెస్ అకాడమీ చైర్మన్ ను కోరిన ఏపీజేఎఫ్
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రితో చర్చించండి
- జర్నలిస్టులకు ప్రమాద బీమా తో పాటు సహజ మరణానికి కూడా ఇన్సూరెన్స్ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలీ - ఏపీజేఎఫ్
- సీనియర్ జర్నలిస్టులకు నెలకు రు.15,000పెన్షన్లు మంజూరు చేయాలి
- రాష్ట్రంలో జర్నలిస్టులందరకు ఇళ్ల స్థలాలు, ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సహకారం ఇప్పించాలి : ఏపీజేఎఫ్





**విజయవాడ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడానికి సహకరించాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ ను ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పి.శివ రాజేష్ కోరారు.రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు జర్నలిస్టులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, వాటిని మార్చి గత ప్రభుత్వానికి ముందు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను మరల తిరిగి పునరుద్దించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాజేష్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ను కోరారు. జర్నలిస్టులకు గతంలో 10 లక్షల ప్రమాద బీమా వర్తించే విధంగా 2019 కు ముందు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అయితే ఆ సమయంలో దాదాపు పదుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం జర్నలిస్టులకు ప్రమాద బీమాను ఇప్పించే విధంగా బాధ్యత తీసుకుందని, అయితే గత ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పిర్ల. శివ రాజేష్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కు వివరించారు. గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఎటువంటి ప్రయోజనకరమైన కార్యక్ర మాలు చేయలేదని, ఈ ప్రభుత్వంలో జర్నలిస్టులకు ప్రయోజనకరమైన అన్ని స్కీములు పునర్ధించి, అమలు అయ్యే విధంగా ప్రభుత్వానికి అకాడమీ చైర్మన్ గా సూచించాలని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ నాయకులు కోరారు.ఆంధ్రప్రదేశ్ లో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు అన్ని ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలని, అందులో భాగంగా మొదటగా విజయవాడ కేంద్రంగా నిర్వహించే విధంగా ప్రెస్ అకాడమీ సహకరించాలని కోరడంతో చైర్మన్ సురేష్ దానికి అంగీకారం తెలిపారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు కు సంబంధించి తేదీలను తెలియజేస్తామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా చూడాలని ఏపీజేఎఫ్ నాయకులు ఆయన ను కోరారు. జర్నలిస్టులకు ప్రమాద బీమా తో పాటు సహజ మరణానికి కూడా ఇన్సూరెన్స్ వర్తించే విధంగా చర్యలు తీసుకుంటే వందలాదిమంది జర్నలిస్టుల కుటుంబాలకు భరోసా గా, చాలా ప్రయోజనకరంగా ఉంటుందనీ ఏపీజేఎఫ్ నాయకులు ఆయన ను కోరడంతో ఆయన స్పందించి ఖచ్చితంగా జర్నలిస్ట్ ప్రమాద భీమా ను అత్యవసరంగా మరల అందుబాటులోకి తీసుకువచ్చి దానితోపాటు సహజ మరణానికి కూడా ఇన్సూరెన్స్ వర్తించే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలతో పాటు సమానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా సీనియర్ జర్నలిస్టులకు 15,000 రూపాయలు పెన్షన్ వచ్చే విధంగా చట్టాన్ని రూపొందించాలని, దేశంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు దశాబ్ద కాలంగా ఆ పథకాన్ని అమలు చేస్తున్నాయని అదే తరహాలో సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ స్కీమును అందుబాటులో తెచ్చేందుకు ప్రయత్నించాలని కోరగా వారు కచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానన్నారు.ప్రెస్ అకాడమీ చైర్మన్ గా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ లు ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన ఏపీజేఎఫ్ నాయకులకు హామీ ఇచ్చారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ ను కలిసిన వారిలో ఏపీజేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అన్నవరపు బ్రహ్మయ్య, రాష్ట్ర కార్యదర్శి యేమినేని వెంకటరమణ, ఏ.పీ.జె.ఎఫ్. ఎలక్ట్రానిక్ మీడియా జాయింట్ సెక్రెటరీ పసుపులేటి చైతన్య, గుంటూరు జిల్లా ఏపీజేఎఫ్ నాయకులు సుభాష్,విజయవాడ ఏపీజేఎఫ్ నాయకులు ప్రశాంత్,కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. అంతముందు ఏపీజేఎఫ్ నాయకులు సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి పొంది,ప్రెస్ అకాడమీ లో బాధ్యతలు వహిస్తున్న భావనారాయణ ను సత్కరించారు.

## 'గ్లోబల్ హెల్త్ కేర్ హబ్'గా హైదరాబాద్

- హైదరాబాద్ లో 'హెచ్‌సీఏ హెల్త్‌కేర్' జీసీసీ ప్రారంభం
- అమెరికా వెలుపల, భారత్ లో మొట్టమొదటిది ఇదే
- 75 మిలియన్ డాలర్ల పెట్టుబడి...3వేల మందికి కొత్తగా ఉద్యోగాలు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**హైదరాబాద్,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** హైదరాబాద్‌ను 'గ్లోబల్ హెల్త్ కేర్ హబ్'గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'హెచ్‌సీఏ హెల్త్‌కేర్' సంస్థ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఆయన రాయదుర్గంలో బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. 'హెచ్‌సీఏ హెల్త్‌కేర్ ప్రధానంగా అమెరికా, యూకేలలో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఈ సంస్థకు 190 ఆసుపత్రులు, 2,400 కేర్ సైట్లు ఉన్నాయి. మొత్తం 3.16 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ ఫార్చ్యూన్ 100 కంపెనీ వార్షిక ఆదాయం 70 బిలియన్ డాలర్లు' అని ఈ సందర్భంగా ఆయన వివరించారు. 'ఇలాంటి దిగ్గజ సంస్థ అమెరికా వెలుపల భారత్‌లో తన మొట్టమొదటి జీసీసీని ఏర్పాటు చేసేందుకు తెలంగాణను ఎంచుకోవడం మనందరికీ గర్వకారణం. ఇది హైదరాబాద్‌కున్న ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యుత్తమ నైపుణ్యం కలిగిన మానవ వనరులకు నిదర్శనం' అని పేర్కొన్నారు. '4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో హెచ్ సీఏ హెల్త్ కేర్ 75 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 620 కోట్లు) పెట్టుబడి పెట్టనుంది. ఈ జీసీసీ కేవలం ఉపాధి అవకాశాలను సృష్టించడమే కాకుండా, ఆరోగ్య సంరక్షణలో నాణ్యత, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. ఐటీ, సప్లై చైన్, ప్రొక్యూర్‌మెంట్, మానవ వనరులు, ఫైనాన్స్, అకౌంటింగ్ తదితర విభాగాల్లో ప్రస్తుతం 1200 మందికి, 2026 నాటికి 3 వేల మందికి కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయి' అని చెప్పారు. 'హైదరాబాద్ గ్లోబల్ హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్ రంగాలకు ముఖద్వారంగా ఎదుగుతోంది. ప్రపంచ స్థాయి ఆసుపత్రులు, 800కు పైగా ఫార్మా కంపెనీలు, ప్రముఖ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ జీసీసీలు, అత్యుత్తమ ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలతో గ్లోబల్ హెల్త్ కేర్ హబ్ గా రూపాంతరం చెందుతోంది. అత్యున్నత ప్రమాణాలను పాటిస్తూనే సరసమైన ఆరోగ్య సంరక్షణను ప్రపంచానికి అందిస్తుంది' అని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్, ఐటీ సలహాదారు సాయికృష్ణ, హెచ్ సీఏ హెల్త్ కేర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ మైక్ మార్ష్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎమిలీ డంకన్, హైదరాబాద్ సెంటర్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ అతుల్ కపూర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారం లో అమ్మవారు



**విజయవాడ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** విజయవాడ పోరంకి, నారాయణ పురం కాలనీ లోని శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం లో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుండి అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల లో భాగంగా బుధవారం నాడు శ్రీ పద్మావతి అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవి గా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మ వారికి విశేష పూజలు జరిపారు. అన్నపూర్ణాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని విరి విరి గా భక్తులు సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా 25 వ తేదీ గురువారం నాడు అమ్మవారిని శ్రీ కాత్యాయని దేవి గా అలకరించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియచేశారు. కావున భక్తులు సందర్శించి అమ్మవారి కృపకు పాత్రులు కావలసినదిగా కమిటీ సభ్యులు కోరారు.

## జివిఆర్ రైస్ బ్యాగ్ వితరణ



**విస్సన్నపేట,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రేల గ్రామపంచాయతీ పరిధిలో వీరరాఘవపురం గ్రామానికి చెందిన కారుమంచి పుల్లయ్య మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి టిడిపి సీనియర్ నాయకులు గాదె వెంకటేశ్వరరావు( జివిఆర్ ) రైస్ బ్యాగ్ వితరణగా అందించారు. తెలుగుదేశం పార్టీ తమ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు.

## పోషకాహారం మహోత్సవం



**తిరువూరు,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** తిరువూరు మండలం ఆంజనేయ పురం గ్రామం అంగన్వాడి కేంద్రంలో జాతీయ పోషకాహార మహోత్సవం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడి కుటుంబరావు ప్రోగ్రాం కోఆర్డినేటర్ రమేష్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, Anm రామకృష్ణమ్మ, అంగన్వాడి కార్యకర్త లలిత, Msk రజిని, దివ్యమణి, B శ్రీనివాసరావు, గర్భిణీలు, బాలింత స్త్రీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేయడం జరిగింది

## మానికిరెడ్డి కి పీస్ ఐకాన్ 2025 పురస్కారం



**కాకినాడ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** గ్లోబల్ పీస్ డే ను పురస్కరించుకొని గ్లోబల్ పీస్ ,కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జె.ఎన్.టి.యు లోని వి.సి ఛాంబర్ లో మానికిరెడ్డి హెల్త్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. మానికిరెడ్డి సత్యనారాయణకు ప్రతిష్టత్మక పీస్ ఐకాన్ 2025 అవార్డును యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ సి.ఎస్. ఆర్.కె ప్రసాద్ అందించారు. ఈ సందర్భం గా మానికిరెడ్డి సత్యనారాయణ గత 30సంవత్సరాలనుండి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. సమాజానికి మానికిరెడ్డి ఆదర్శమని, ప్రపంచశాంతికి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతీఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక వేత్తలు డా. అద్దంకి రాజా యోనా, డా. తురగా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా దేవి శరన్నవరాత్రులు



**తోట్లవల్లూరు,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలోని పలు గ్రామాల్లో వైభవంగా సాగుతున్నాయి. తోట్ల వల్లూరు శివాలయంలో అమ్మవారు శ్రీ భ్రమరాంబ దేవిగా బుధవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి హరి దుర్గా నాగేశ్వరరావు, గుమస్తా శ్రీనివాస్ రెడ్డి ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్



**పెడన,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** భారత దేశ ఉపరాష్ట్రపతి రాధాకృష్ణ కు స్థానిక శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ బుధవారం పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఉపరాష్ట్రపతిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇతర శాసనసభ్యులతో కలసి గన్నవరం ఎయిర్ పోర్టులో కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాసనసభ్యులు కాగిత ఉపరాష్ట్రపతికి పరిచయం చేశారు.

# పెడనలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన శ్రీ వాసవి మాత





**పెడన,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రము నందు సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో శ్రీదేవి శరన్నవరాత్ర దసరా మహోత్సవములు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 3వరోజు బుధవారం భక్తులకు శ్రీ అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చిన ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి మాత ఉభయ దాతులైన అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు డా. కొల్లూరి సత్యనారాయణ మంజులత తుమ్మలపల్లి నాగమల్లేశ్వరరావు వీరవాణి తుమ్మలపల్లి వంశి వర్ధన్ ప్రేమాన్విత దంపతులచే ఉదయం తీర్థపు బిందె ఊరేగింపు గణపతి పూజ శివపార్వతులకు అభిషేకం శ్రీ వాసవి మాత ఉత్సవిగ్రహానికి అభిషేకములు శ్రీ అన్నపూర్ణ దేవి హోమం తదితర పూజా కార్యక్రమాలను వాసవి క్షేత్రం ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు నేతృత్వంలో కోట సతీష్ శర్మ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక కుంకుమ పూజ కార్యక్రమంలో 100 మంది మహిళా భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన వారి ఆధ్వర్యంలో 108 మంది సువాసినీలకు పూజలు నిర్వహించి జాకెట్ ముక్క పసుపు కుంకుమ గాజులు అందజేశారు. మహిళా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో లలితా పారాయణ చదివారు. పెడన పట్టణ పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ వాసవి మాతను దర్శించుకున్న భక్తులకు ఉభయ దాతలు కొల్లూరి సత్యనారాయణ మంజులత తుమ్మలపల్లి నాగమల్లేశ్వరరావు వీరవాణి తుమ్మలపల్లి వంశి వర్ధన్ ప్రేమాన్విత కుటుంబ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెడన మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేసు శ్రీనివాస్ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు ఆర్థిక సలహాదారులు సమయమంతులు ముత్యాలరావు ఉత్సవాల కమిటీ కన్వీనర్ కొల్లూరి రాధాకృష్ణగుప్తా కార్యవర్గ సభ్యులు జల్లూరి సత్యనారాయణ బోదినపల్లి శ్యాంప్రసాద్ సభ్యులు భవిరిశెట్టి నాగేశ్వరరావు ఉదయగిరి గోపాల్ శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు తమ్మన లక్ష్మి తాయారు కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ తల్లి దసరా ఉత్సవ కమిటీ సభ్యుడిగా కాకు మల్లికార్జున యాదవ్





**విజయవాడ, సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** ప్రతిష్ఠాత్మకమైన విజయ వాడ కనకదుర్గమ్మ ఉత్సవాల కమిటీ సభ్యుడిగా కాకు మల్లికార్జున యాదవ్ ప్రభుత్వం చే నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు "వార్తా ప్రభ"తో మాట్లాడుతూ తనను కమిటీ సభ్యుడిగా నియమింప చేసిన పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రతి భక్తుడికి అమ్మవారి దర్శనాన్ని కల్పించాలన్న ఉద్దేశంతో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 తేదీ వరకు 11 రోజులు పాటు క్యూలైన్లో భక్తులకు సౌకర్యార్థం నిరంతరాయంగా మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అదేవిధంగా క్యూ లైన్లు ఎక్కడ ఆగకుండా ఫ్రీ గా వెళ్లి అమ్మవారిని చక్కగా దర్శనం చేసుకుని వచ్చే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీఐపీలు ఒత్తిడి కూడా తగ్గిస్తూ వాళ్ల సమయాన్ని వాళ్ళ కి కేటాయించడంతోపాటు వీఐపీలు దర్శనం కంటే ఫ్రీ దర్శనాలే త్వరగా అవుతున్నాయని కాబట్టి ప్రతి ఒక్కరు అమ్మవారి భక్తులు అక్కడ బిజీగా ఉంటుందని అపోహలకు పోవద్దన్నారు. భక్తులకు ఫ్రీగా దర్శనం అవుతా ఉంది కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రతిరోజు అమ్మవారిని దర్శించుకుని ఈ నవరాత్రుల్లో 11 అవతారాల్లో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని మల్లికార్జున్ యాదవ్ కోరారు.

## అసంపూర్తి కళ్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తా

### -సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్





**కాజులూరు,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న శెట్టిబలిజ కళ్యాణ మండపం పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తానని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం హామీ ఇచ్చారు. బుధవారం కాజులూరు మండలం దుగ్గుదూరు గ్రామంలో కళ్యాణ మండపం భవన నిర్మాణం ఉన్నా.. పూర్తిస్థాయిలో నిధులు లేక అసంపూర్తిగా ఉన్న శెట్టిబలిజ కళ్యాణ మండపానికి ఆయన కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే హయాంలో నిర్మించిన ఈ కళ్యాణ మండపం నేటికీ అసంపూర్తిగా ఉండడంతో కూటమి పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు కళ్యాణ మండపం వినియోగంలోకి వచ్చేలా సహకరించాలని వాసంశెట్టి సత్యంను కోరగా, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకెళ్లటంతో పాటు, వ్యక్తిగతంగా కూడా సాయం అందించి కళ్యాణ మండపం పూర్తి చేసేందుకు అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు కళ్యాణ మండపం వినియోగంలోకి తెచ్చేందుకు తగు చర్యలు చేపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు సత్యనారాయణ ( పెద్ద), కుడిపూడి గోవిందరావు (కొండ),లకాని కృష్ణ చైతన్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## యల్.బి.ఆర్.సి.ఈ లో ఎమోషనల్ ఇంటలిజెన్స్ అండ్ లైఫ్ స్కిల్స్ పై అవగాహన సదస్సు





**మైలవరం,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఐసిసి, సహేలి గర్ల్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో "ఎమోషనల్ ఇంటలిజెన్స్ అండ్ లైఫ్ స్కిల్స్ "అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఈ.ఈ.ఈ పూర్వ విద్యార్థిని కె.జ్యోతి , Child Adolescent Councilor, ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ చీర్ హాగ్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ , తమిళనాడు రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థి నులు జీవన నైపుణ్యాల ప్రాముఖ్యతను తెలుసుకోవటం , భావోద్వేగిత బుద్ధి ని అర్థం చేసుకోవటం, వృత్తి మరియు వ్యక్తిగత జీవితం లో మంచి నిర్ణయాలు తీసుకోవటం అనే అంశాల గురుంచి ప్రసంగించారు. ఐసిసి ప్రిసైడింగ్ ఆఫీసర్ డా.ఒ.రమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మన భావాలు మనల్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయో తెలుసుకొని,జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొవటానికి కావాలిసిన ధైర్యం ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి మాట్లాడుతూ చదువు, ఉద్యోగాలు, వ్యాపారాలలో ముందడుగు వేయగలగటం, ఒత్తిడిని తట్టుకొనే శక్తి, మంచి నిర్ణయాలు తీసుకొనే ధైర్యం మరియు మహిళా ఇంజినీర్లు ఎదుర్కొనే ప్రత్యక సవాళ్లు అనే అంశాలు మీయొక్క భవిష్యత్తును ఉన్నత స్థాయిలో ఉంచగలవని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జి.తబిత, డా.కె .రాణి రుద్రమ కో ఆర్డినేటర్లు గా వ్యవహరించారు. ఈ కార్యక్రమం లో ICC, సహేలి గర్ల్స్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ , కో ఆర్డినేటర్లు మరియు 450 మంది విద్యార్ధునులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జరిగిన ఎన్.ఎస్.ఎస్ డే దినోత్సవ వేడుకలు




**కృత్తివెన్ను,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్.ఎస్.ఎస్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల సెమినార్ హాల్లో జరిగిన ఈ ఎన్.ఎస్.ఎస్. డే వేడుకలకు ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్. ఎస్. జగన్ మోహన రావు సభాధ్యక్షత వహించి ఆద్యంతం కూడా సమర్థవంతంగా ఈ సదస్సును నిర్వహించారు. మహాత్మా గాంధీ మేధస్సు లో వెలువడిన లక్షణాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థినీవిద్యార్థులకు తేటతెల్లంగా తెలియపరిచారు. సమర్థవంతమైన నాయకత్వం, సహానుభూతి, సామాజిక సేవ మొదలైన లక్ష్యాలుగా ముందుకు దూసుకెళుతుండటం ఎన్.ఎస్.ఎస్ గా పరిగణించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్. మట్టా రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ కళాశాల నానాటికి పురోగతి చెందటం హర్షదాయకమని,ఎన్.ఎస్ఎస్ డే సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మహాత్మా గాంధీ సేవా నిరత ని మదర్ థెరిస్సా నిర్మలమైన దీక్షను తెలియపరిచారు. ఈ సదస్సు కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బి. ఆనందకుమార్ సారథ్యంలో జరిగింది. ఈ సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి. దేవరాజు ,కంప్యూటర్ శాఖ అధిపతి డాక్టర్ కె. సత్య రాజేష్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఆర్. హిమాలినీ దేవి, రామారావు, జ్యోత్స్న, చలం ప్రసాద్, రత్న మొదలైన అధ్యాపకులతో పాటు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు అందరూ సామాజిక సేవకు పునరంకితం అవుతూ ప్రత్యేక ప్రతిజ్ఞ చేశారు.

## విజయవాడలో విశ్వసనీయ ఇంధన కేంద్రంగా యలమంచిలి ఫిల్లింగ్ స్టేషన్





**విజయవాడ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** విజయవాడ నగర ప్రజలకు నమ్మకమైన ఇంధన సేవలను అందించే దిశగా బుధవారం పటమట సెంటర్‌లో యలమంచిలి ఫిల్లింగ్ స్టేషన్ ఘనంగా ప్రారంభమైంది. సంస్థ అధినేత యలమంచిలి రాజీవ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి తొలి విక్రయం జరిపి ప్రారంభోత్సవం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యలమంచిలి ఫిల్లింగ్ స్టేషన్ నమ్మకానికి భరోసాగా నిలుస్తుందని, ఉత్తమ నాణ్యతతో కూడిన సేవలే తమ లక్ష్యం అని హామీ ఇచ్చారు. కొలత, నాణ్యత విషయంలో రాజీ పడకుండా వినియోగ దారులకు పెట్రోల్ , డీజిల్ విక్రయిస్తామన్నారు. ప్రారంభోత్సవ వేడుకలో యలమంచిలి బసవేశ్వరరావు, కౌశిక్, తిలక్, సుంకర రవి, స్థానిక ప్రజా ప్రతినిధులు, రాజీవ్ యూత్ కార్యకర్తలు పెద్దయెత్తున పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నందిగామ లో పోషణ మాసోత్సవం



**పెడన,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** పెడన మండలం లోని నందిగామ లో బుధవారం నాడు ఎనిమిదివ రాష్ట్రీయ పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర శిశు అభివృద్ధి పథకం( ఐసిడిఎస్) బంటుమిల్లి ప్రాజెక్ట్ పరిధిలోఈ కార్యక్రమాలు 8 వరోజు సంబంధిత శాఖ వారు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి పోషణ తో పలు విషయాల గురించి బంటుమిల్లి ప్రాజెక్టు సిడిపిఓ సముద్రవేణి వివరించారు. ముఖ్యంగా చిన్నపిల్లల ఆహారపు అలవాట్లు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి చెపుతున్నారు సూపర్ వైజర్ పిట్ల కల్పవల్లి తో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది పలు విషయాల పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచి బొడ్డు చినబాబు ఎంపీటీసీ బొడ్డు గురునాథం అంగన్వాడీ కార్యకర్తలు కోటేశ్వరమ్మ వెంకట్రావమ్మ విజయలక్ష్మి సత్తారు లీడర్లు గీత పార్వతి ఎం ఎస్ కె ఏఎన్ఎం ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## స్వస్తి నారి స్వసక్తి పరివార్ వైద్య సేవలు



**విస్సన్నపేట,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో స్వస్తినారి స్వసక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి నందు పలు విభాగాల వైద్యులు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని, డాక్టర్ రాజకుమార్, డాక్టర్ శేషగిరి,డాక్టర్ అవినాష్, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ స్వప్న, డాక్టర్ ప్రమోద్,డాక్టర్ జెనీషా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు అమృతం తో సమానం - డాక్టర్ నాగ రాణి



**పెనుగంచిప్రోలు,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు ప్రాజెక్టు పరిధిలో ఉన్న ముచ్చింతాల గ్రామంలో పోషకాహార మాసోత్సవం ఐదవ రోజు బుద్ద వారం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ గర్భవతులకు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించడం జరిగింది .తల్లిపాలు అమృతంతో సమానమని బిడ్డ పుట్టిన అరగంటలో ముర్రుపాలు పట్టించాలని వివరించారు. తల్లిపాలు పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచుతాయని తల్లిపాలు తాగిన బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ గర్భవతులకు బాలింతలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగరాణి అంగన్వాడి కార్యకర్తలు, ఎమ్మెల్ హెచ్ పి లు ,ఏఎన్ఎంలు ,ఆశాలు పాల్గొన్నారు..

## శ్రీ కాశీ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ తల్లి



**గుడ్లవల్లేరు,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** దసరా నవరాత్రుల్లో భాగంగా వేమవరం శ్రీ కొండలమ్మ తల్లితో పాటు అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో అమ్మవార్లు శ్రీ కాశీ అన్నపూర్ణాదేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరుని ఆలయంలో అమ్మవారు ధైర్యలక్ష్మీ దేవిగాను, కౌతవరం శ్రీ గంగా పార్వతీ సమేత గౌతమేశ్వరాలయంలో అమ్మవారు శ్రీ లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విశేషాభిషేకాలను అందుకున్న అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# బోగస్ కిక్ బాక్సింగ్ సంఘాలతో జాగ్రత్త

- కిక్ బాక్సింగ్ క్రీడాకారులు అప్రమత్తంగా ఉండాలి
- తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ విజ్ఞప్తి




**హైదరాబాద్ సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కిక్ బాక్సింగ్ పేరిటనకిలీ సంఘాలు ఇచ్చే బోగస్ సర్టిఫికెట్లు తో క్రీడాకారులకు నష్టం కలిగించవద్దని తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ భవనంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎం మహిపాల్ కోశాధికారి పి శ్రీనివాస్ లు మాట్లాడుతూ, తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, మరియు తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ గుర్తింపు ఇచ్చిన ఏకైక సంఘం అని, జాతీయ కిక్ బాక్సింగ్ సంస్థ వాకో ఇండియా కిక్ బాక్సింగ్ ఫెడరేషను ను యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం గుర్తించిందని తెలిపారుతెలంగాణ రాష్ట్రంలో అన్ని అధికారిక గుర్తింపులు ఉన్న ఏకైక సంస్థ తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ 2017లో స్థాపించబడి అప్పటినుండి దాని పరిధిని దినదినం విస్తరిస్తూ దాదాపు 25 జిల్లాల్లో పటిష్టమైన సభ్యత్వం నాయకత్వం ఉందని వారు తెలిపారు. ఉండగా కొంతమంది అనధికారికంగా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ పేరిట చెల్లుబాటు కానీ రిజిస్ట్రేషన్ లతో క్రీడాకారులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని దీని నుండి కిక్ బాక్సింగ్ క్రీడాకారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వారు నిర్వహించే పోటీలకు వారు ఇచ్చే సర్టిఫికెట్లకు ఎటువంటి గుర్తింపు లభించదని వారు తెలిపారు. కాబట్టి బోగస్ సంఘాలతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. కిక్ బాక్సింగ్ క్రీడా పట్ల వారికి అభిమానం ఉంటే తమతో కలిసి పని చేయాలని అంతేకానీ చెల్లుబాటు కానీ సంఘాలు పెట్టి క్రీడాకారుల మోసం చేయడం తగదన్నారు. అధికారికంగా అన్ని గుర్తింపులు ఉన్న తమ సంఘం కు సహకరించాలని క్రీడాకారులకు వారి తల్లిదండ్రులకు క్రీడా అధికారులకు వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి రెండవ విడుత పది లక్షల రూపాయలు మంజూరు,

## జవహర్ నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సోమా నర్సింగరావ్ ముదిరాజ్,



**జవహర్ నగర్, సెప్టెంబర్ 24:(వార్తా ప్రభ)**బుధవారం రోజున మినిస్టర్ కోటర్స్ లో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు దొంతర బోయినా కృప సాగర్ ముదిరాజ్, ఆధ్వర్యంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డా. బండ ప్రకాష్ ముదిరాజ్, జవహర్ నగర్ ముదిరాజ్ భావన నిర్మానికి రెండవ విడత గా రూ.10.00000/- పది లక్షలు మంజూరు చేయడం జరిగింది. జవహర్ నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సోమ నర్సింగ్ రావు ముదిరాజ్, డా. బండ ప్రకాష్ ముదిరాజ్ ని ఘనంగా సన్మానం చేసి, కమిటీ సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కాసుల రవి ముదిరాజ్, మాచర్ల సాయి కుమార్ ముదిరాజ్, విలేకరి చింతల విజయకుమార్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరు ముద్దాయిలు అరెస్టు:

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, మండల పరిధిలోని సీతంపేట బంజరా గ్రామా నివాసులు బాదావత్ మాన్య , కోమటపల్లి గ్రామానికి చెందిన భూక్యా సురేష్ అను ఇద్దరు వ్యక్తులు Cr. No: 96/2021 ఆఫ్ సుజాతనగర్ పోలీస్ స్టేషన్ కేసులో గల ముద్దాయిలు అయినటువంటి వీరు ఇరువురు కూడా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతుండడంతో కొత్తగూడెం సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ కోర్టు వారు జారీ చేసినటువంటి నాన్ బెయిలబుల్ వారెంట్ పై సుజాతనగర్ .ఎస్ఐ, రమాదేవి ఆ ఇద్దరు ముద్దాయిలను అదుపులో తీసుకొని కోర్టు కీ హాజరు పరిచి జుడిషియల్ రిమాండ్ నిమిత్తం భద్రాచలం సబ్ జైలుకు పంపించారు ఈ సందర్భంగా ఎస్ఐ, రమాదేవి మాట్లాడుతూ సుజాతనగర్ మండల ప్రజలు కోర్టు వాయిదాలకు క్రమం తప్పకుండా హాజరు కావలసిందిగా లేనియెడల పై ముద్దాయిల మాదిరిగానే అరెస్టు వారెంట్ పై జైలుకు తరలించడం జరుగుతుందని ఆమె అన్నారు




# నయా ఈద్గా లో పార్కింగ్ సౌకర్యం కల్పించాలి

- జవహర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అనుబంధ సంస్థ పురాణ, నయా ఈద్గా(శ్మశాన వాటిక) కమిటీ డిమాండ్.
- వికలాంగుల కాలనీలోగల నయా ఈద్గాకు ఇంచార్జ్ గా ముబషీర్(అబ్బు), సహాయకులుగా ఎస్.సయ్యద్, మహ్మద్ మోయినుద్దీన్
- కమిటీ నుండి అక్తార్, ఆటో మౌలాన తొలగింపు,
- పోలీసు అధికారులకు ధన్యవాదాలు తెలియజేసిన కమిటీ సభ్యులు



**జవహర్ నగర్, సెప్టెంబర్ 24:(వార్తా ప్రభ)** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్, బాలాజీనగర్, వికలాంగుల కాలనీలోగల నయా ఈద్గా(ముస్లిం శ్మశాన వాటిక) గ్రేవ్ యార్డ్ అభివృద్ధిలో బాగంగా పార్కింగ్ కొరకు స్థలాన్ని కేటాయించాలని జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అద్యక్షులు మహ్మద్ పాషామియా, కార్యదర్శి టి.కాలేషా డిమాండ్ చేశారు. సెప్టెంబర్-24, 2025, బుధవారం రోజు స్థానిక చెన్నాపురం దేవేందర్ నగర్ లో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీకి అనుబంధ సంస్థ అయిన పురాణ, నయా ఈద్గా కమిటీ సభ్యుల సమావేశం పురాణ ఈద్గా ఇంచార్జ్ షేక్ హామద్ అధ్యక్షతన జరిగింది. గత 14 సంవత్సరాలుగా నయా ఈద్గా అభివృద్ధి ఆమడదూరంలో ఉందని, దాన్ని అభివృద్ధికి ప్రతి సభ్యుడు పాటుపడాలని ఎం.డి షాపామియా, టి.కాలేషా సూచించారు. గతంలో కొనసాగిన ఇంచార్జ్ అవినీతి, అక్రమాలకు పాల్పడి, ముస్లిం ప్రజల విశ్వాసాన్ని వమ్ముచేశారని ఆరోపించారు. మోహన్ రావు కాలనీలోగల పురాణ ఈద్గా నిర్వాహకుల సహాయ సహకారాలతో ప్రతి సంవత్సరం నయా ఈద్గాలో రంజాన్, బక్రీద్ పండుగల ప్రార్థనలు సజావుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ధఫ్నా, ప్రార్థనల సందర్భంగా వజూ, నమాజ్ చేసుకోవడానికి నీటి సౌకర్యం కల్పించుకోలేక పోతున్నామని ఆవేదన చెందారు. నయా ఈద్గా అభివృద్ధిలో బాగంగా బోరుబావి, పార్కింగ్, ఈద్గా చుట్టూ ఫెన్సింగ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవడానికి క్రుషి చేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. అనంతరం నయా ఈద్గా ఇంచార్జీగా ముబషీర్(అబ్బు), సహాయకులుగా ఎస్.సయ్యద్, మహ్మద్ మోయినుద్దీన్ ను కేటాయిస్తున్నట్లు తీర్మానించారు. మరియు ఈద్గా పేరుతో మట్టి అక్రమ తవ్వకాలకు, అవినీతికి పాల్పడి, కమిటీల నుండి తోలగించబడిన మహ్మద్ యూసూఫ్ ఖాద్రీ అనే వ్యక్తితో కలిసి, కమిటి నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అక్తార్, మౌలాన లను తొలగిస్తూ, వారి స్థానంలో మరో ఇద్దరిని సహాయకులుగా తీసుకోవడానికి తదుపరి సమావేశంలో చర్చించాలని, అదేవిధంగా ప్రభుత్వం, అధికారులు నయా ఈద్గాకు పార్కింగ్ స్థలం కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ పలు తీర్మానాలు చేశారు. మంగళవారం రోజున కమిటీ సభ్యులు మిలాన్ ఉన్ నబీ ప్రదర్శనను ప్రశాంతంగా జరగడానికి క్రుషి చేసిన పోలీసు అధికారులను, పోలీసులను కలిసి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈపై సమావేశంలో మహ్మద్ ఖాన్ సాబ్, ఎండి సోహెల్, గౌస్ బాబా, వహీద్, సలావుద్దీన్, అఫ్జల్, షఫీ, హబీబ్, ఎండి మతిన్, అలీ, షాకీర్, మోహిత్, ఎండి మౌలా తదితరులు పాల్గొన్నారు.

# డా. దాసరి నారాయణరావు స్మారక ప్రతిభ అవార్డు అందుకున్న దరువు అంజన్న

- కళా, సాంస్కృతిక,సామాజిక సేవా రంగాలలో సేవలందించిన వారికి ఇచ్చే అవార్డు.
- గత 30 సంవత్సరాలుగా కళ, సామాజిక సేవా రంగాలలో సేవలందిస్తున్న దరువు అంజన్న





**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 24 (వార్తాప్రభ) :** ఫ్రెండ్ షిప్ మినిస్ట్రీస్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం, అత్యంత ఆహ్లాదభరితంగా జరిగింది, ఈ సందర్భంగా ఫ్రెండ్ షిప్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. ఆలూరి విల్సన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కళా, సాంస్కృతిక సేవా రంగాలలో సేవలందించిన వారికి ఈ అవార్డును ఇస్తామని ఈ అవార్డు చాలా ప్రతిష్టాత్మకమైనదని అన్నారు, 2025 గాను గత 30 సంవత్సరాలుగా సాంస్కృతిక సామాజిక సేవా రంగాలలో విశిష్టమైన సేవలందిస్తూ తెలంగాణ ఉద్యమకారుడిగా, సామాజిక సేవకుడిగా పేరొందిన ప్రముఖ వాగ్గేయ కారుడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్న ను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు, ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీ నటులు చింతకుంట మాణిక్ రావు మాట్లాడుతూ దరువు అంజన్న సామాజిక సాహిత్య సాంస్కృతిక రంగాలలో ఎనలేని సేవలు అందించాడని ఆయనకు ఈ అవార్డు దక్కడం సమంజసం అని సంతోషం వ్యక్తం చేశారు, సంస్థ ప్రధాన కార్యదర్శి ఇందిరా మాట్లాడుతూ దరువు అంజన్న సాంస్కృతిక సేవ కొనియాడలేనిదని అందుకే సినీ రంగంలో ఎనలేని సేవలందించిన డాక్టర్ దాసరి నారాయణరావు అవార్డును ఇవ్వడం జరిగిందని అన్నారు, విశిష్ట అతిథిగా పాల్గొన్న శ్రీశైల పుణ్యక్షేత్ర అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ నరాల నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ తెలంగాణ వారు కళల పట్ల ఇంత శ్రద్ధ చూపడం విశిష్ట సేవలు అందించిన వారిని గుర్తించడం హర్షించదగ్గ విషయమని అన్నారు, ప్రముఖ గాయని ప్రసన్న ఆరోహి మాట్లాడుతూ దరువు అంజన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సలహాదారుడిగా గొప్ప పాత్ర పోషిస్తున్నాడని అణగారిన కళాకారులకు దారి చూపిస్తున్నాడని వారిలో నిగూఢమైన కళను ప్రోత్సహిస్తున్నాడని కొనియాడారు. అవార్డు అందుకున్న దరువు అంజన్న మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన డాక్టర్ దాసరి నారాయణరావు పేరిట అందిస్తున్న ఈ అవార్డు ఇవ్వడం నాపై ఇంకా బాధ్యతలు పెంచిందని సాంస్కృతిక సేవ రంగాలలో ఇంకా ఉత్సాహంతో పని చేస్తానని కళాకారులకు తోడుగా ఉంటానని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతి శాఖ తరపున వెనుకబడ్డ కళాకారులు అందరిని ఆదరించేలా కృషి చేస్తానని అన్నారు అదేవిధంగా నన్ను గుర్తించిన ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ తెలంగాణ వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

# నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పూర్తికి తక్షణమే చర్యలు తీసుకోండి

## నిధులు సరిపోకపోతే ముఖ్యమంత్రి తో మాట్లాడే శాంక్షన్ చేపిస్తా....

## సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించిన శాసనసభ్యులు అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతి మరియు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల తో కలిసి పిఏసీ చైర్మన్, శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్లలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై ఉప కమిషనర్ తో చర్చించడం జరిగింది. పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడలని,అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని,అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అధిక మొత్తంలో నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని,పనులలో వేగం పెంచాలని సకాలంలో నిధులు మంజూరు అయ్యేలా చూడలని, అభివృద్ధి పనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని,అవసరమున్న చోట రోడ్ల విస్తరణ పనులు చేపట్టడం ద్వారా ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుండి ఉపశమనం లభిస్తుంది అని,విధి దీపాల సమస్యను పరిష్కరించాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని,వర్షాకాలంలో గల ఎదురయ్యే సమస్యల పట్ల పూర్తి స్థాయిలో సన్నద్ధం అయ్యేలా అధికారులకు అదేశాలు ఇవ్వాలని,మాన్ సున్ సిబ్బందిని అప్రమత్తంగా ఉండేలా చూడలని, అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని,ఇటీవల కురిసిన వర్షాల వలన దెబ్బ తిన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. అదేవిధంగా చెరువుల సుందరికరణ,పార్క్ లు అభివృద్ధి చేపట్టాలని,రోడ్ల మరమ్మతులు చేపట్టాలని,అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజి పడకూడదు అని, అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకోవాలని,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు ఏర్పాటు కు కృషి చేయాలని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ మెహ్రా ,ఏసీపి వెంకటరమణ మరియు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట సెప్టెంబర్ 24 (వార్తాప్రభ)** బుధవారం రోజు జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించి పెండింగ్ కేసులను తగ్గించాలని, ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని, ముందస్తు నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ తెలిపారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ కేసు నమోదైన వెంటనే నిందితులను అరెస్టు చేయాలి, నిందితులను అరెస్టు చేసే విషయంలో ఎలాంటి జాప్యం ఉండకూడదు, లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలి, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి, ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలి, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎన్ఫోర్స్మెంట్ విధులు నిర్వహించాలి. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలి. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. పెండింగ్ లో ఉన్న కేసులలో అన్ని కోణాలుల్లో పరిశోధన చేసి కేసులు ఫైనల్ చేయాలని సూచించారు. దొంగతనాల నివారణ గురించి ప్రత్యేక చర్యలు చేపట్టాలి రాత్రి సమయాలలో బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ అధికారులు సిబ్బంది నిరంతరంగా విధులు నిర్వహించాలి. డయల్ 100 కాల్ రావాలి వెంటనే రెస్పాండ్ అయి స్వార్థమైనంత త్వరగా సంఘటన స్థలానికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. డయల్ 100 కాల్స్ పై అలసత్వం వహించవద్దు. నాన్ బేలబుల్ వారెంట్ సాధ్యమైనంత త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల గురించి రోడ్ సేఫ్టీ కమిటీ, సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులతో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను సందర్శించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు పెండింగ్ ఉన్న దరఖాస్తులను విచారణ చేసి త్వరగా డిస్పోజల్ చేయాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజబుల్ పోలీస్ సింగ్ విధులు నిర్వహించాలి,

వార్తా ప్రభ

# హైదరాబాద్

## శిల్పా రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు, బతకమ్మ, దసరా సెలబ్రేషన్స్







**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ):**మాదాపూర్ లోని శిల్పారామం లో దేవి నవరాత్రి ఉత్సవాలు,బతుకమ్మ,దసరా సెలెబ్రేషన్స్ అండ్ సారీస్ అఫ్ ఇండియా మేళ ను నిర్వహిస్తున్నారు.బనారస్, చెందేరి,కోట,గుజరాతీ, ఉప్పాడ,బనారస్, కాశ్మీరీ,మొదలైన చీరలు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి.సంగీత సిస్టర్స్ సంగీత కళ మరియు రాజ్యలక్ష్మి బృందం లలిత పాటలు అలరించాయి.కిరణ్మయి బోనాల బృందం నవత్మిక" కూచిపూడి నృత్య రూపకం ఎంతగానో అలరించింది .సంచలన, సమ్మోహన,శృతి,స్వాతి,కృతి,తరుణిగా ,అనన్య,స్తుతి కళ్యాణ్, హర్షిత,శరణ్య,సహస్ర,ద్రితి,తన్వి,సరయు మొదలైన వారు నవదుర్గలుగ నర్తించారు. శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మ ను పేర్చి సందర్శకులతోకలిసి ఆడుకున్నారు

## తప్పుడు పత్రాలతో అనుమతి పొందిన వాటర్ ప్లాంట్ ను తక్షణమే తొలగించండి

### కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 24 (వార్తాప్రభ):**అధికారులను తప్పుదారి పట్టించి తప్పుడు పత్రాలతో అనుమతులు పొంది ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను తొలగించాలని కోరుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గల మియాపూర్ డివిజన్ లోనీ మక్తా మహబూబ్ పేట్ గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయం లో పిర్యాదు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సతీష్ అనే వ్యక్తి అక్రమంగా బోర్ వేసి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి నీటి వ్యాపారం చేస్తున్నాడని,దీంతో గ్రామంలో మిగతా వారి ఇండ్లలోని బోర్లు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పిర్యాదులో పేర్కొన్నారు.ఇదే విషయమై గతంలో స్థానిక ఎమ్మార్వో కు పిర్యాదు చేయగా అధికారులు వచ్చి ప్లాంట్ ను సీజ్ చేసి మళ్ళీ ప్రారంభించవద్దని హెచ్చరించారు.కానీ కొన్ని రోజుల్లోనే అధికారుల్ని మ్యానేజ్ చేసుకొని అనుమతులు తెచ్చుకొని తిరిగి ప్లాంట్ ను కొనసాగిస్తుండడం తో గ్రామం లోని బోర్లు ఎండిపోతున్నాయని తెలిపారు.నిబంధనల ప్రకారం బోర్ కు ప్లాంట్ కు 200 మీటర్ల దూరం ఉండాలి కానీ 25,35 మీటర్ల దూరం లోనే వాటర్ ప్లాంట్ ఉందని,ప్లాంట్ యజమాని ఇంటి పక్క వారిని కలుపుకొని అడ్డదారిలో ప్లాంట్ ఏర్పాటు చేశాడని,దాన్ని వెంటనే తొలగించాలని కోరారు.లేదంటే గ్రామస్తులందరం ప్రభుత్వ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సార రవీందర్,గుండె గణేష్ ముదిరాజ్,పి.శ్రీనివాస్ గౌడ్,సారా రాము,సారా కృష్ణ,గంగారం నర్సింగరావు,జె శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

## తెలంగాణ అన్న హజారే ఎస్.ఎన్. షా నక్వీ కి పౌర సన్మానం

**బెల్లంపల్లి సెప్టెంబర్ 24 (వార్తాప్రభ)** హైదరాబాద్ రాగభారతి కల్చరల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ అన్న హజారేగా గుర్తింపు పొందిన ఎస్.ఎన్. షా నక్వీ ని ఘనంగా సన్మానించారు.నక్వీ తన జీవితాంతం మూఢనమ్మకాల నిర్మూలన, రక్తదానం, సామాజిక సేవ, కుల నిర్మూలనలో నిరంతరంగా కృషి చేసి సమాజంలో మార్పు కోసం విశేషంగా సేవలందించారు. అదేవిధంగా సాంస్కృతిక రంగంలో భాగంగా ఘంటసాల గారి పాటలను పాడుతూ కళారంగానికి అందిస్తున్న సేవలను గుర్తించి ఆయనకు సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా ఘంటసాల ఇంటర్నేషనల్ ట్రస్ట్ అధినేత శిరోమణి వంశీ రామరాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం సిహెచ్. త్రినాధరావు పౌర సన్మానం జ్ఞాపికను నక్వీ గారికి అందజేశారు. పురస్కారాన్ని అందించిన రాగభారతి కల్చరల్ ఫెడరేషన్ వారికి నక్వీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ఎడిటోరియల్

## తగ్గేదేలే.. వైసీపీ అధినేత జగన్ కీలక నిర్ణయం..

వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి విపక్ష హెూదా కోసం న్యాయపోరాటం చేయాలని నిర్ణయించారు. ఆరు నూరైనా ప్రభుత్వం దిగిరావాల్సిందేనని జగన్ పట్టుబడుతున్నారు. సభలో రెండే పక్షాలు ఉన్నాయని, అందులో ఒకటి అధికారపక్షం, ఇంకొకటి ప్రతిపక్షం కనుక వైసీపీకి విపక్ష హెూదా ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. తనను ప్రతిపక్ష నేతగా గుర్తించేందుకు నిరాకరిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఇచ్చిన రూలింగ్ చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని జగన్ తన పిటిషన్ లో కోరినట్లు చెబుతున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇచ్చిన రూలింగ్ ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్స్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్ క్వాలిఫికేష్ చట్టంలోని సెక్షన్ -12 కి విరుద్ధంగా పరిగణించాలని జగన్ హైకోర్టును వేడుకున్నారు. ప్రతిపక్ష హెూదా ఇచ్చేలా ఏపీ శాసనసభ వ్యవహారాల కార్యదర్శి, అసెంబ్లీ స్పీకర్ కార్యదర్శిని ఆదేశించాలని ఆయన విన్నవించారు. ఇందులో శాసనసభ కార్యదర్శి, న్యాయశాఖ ముఖ్యకార్యదర్శి, స్పీకర్ కార్యదర్శి, వ్యక్తిగత హెూదాలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ను ప్రతివాదులుగా చేర్చారు. గతంలోనే మాజీ సీఎం జగన్ తనను ప్రతిపక్ష నేతగా గుర్తించేలా ఆదేశించాలంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. జులైలో జగన్ కోర్టును ఆశ్రయించగా, ఆ తర్వాత జగన్ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూలింగ్ ఇచ్చారు. ఇప్పుడు స్పీకర్ రూలింగ్ రద్దు చేసి తనను ప్రతిపక్ష నేతగా గుర్తించాలంటూ మంగళవారం కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేయడం ద్వారా ప్రభుత్వంపై న్యాయపోరాటం ద్వారా ఒత్తిడి పెంచేలా జగన్ వ్యవహరిస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా, జగన్ వేసిన పిటిషన్ లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు వైఖరిని తప్పుపడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. %బూశ్రీంశీ =ఘుం% - సభకు రాకుండా సంతకాలా..? వైసీపీ సభ్యులపై ఎథిక్స్ కమిటీ ఫోకస్ ప్రతిపక్ష నేత హెూదా ఇమ్మని తమ పార్టీ అడగడాన్ని అసమంజసమైన కోరికగా స్పీకర్ పేర్కొన్నారని, అందులో భాషను పరిశీలిస్తే తనకు ప్రతిపక్షనేతగా గుర్తించకూడదని ముందే నిర్ణయించుకున్నట్లు అర్థం అవుతోందని ఆరోపించారు. న్యాయ నిష్పాక్షికత, పార్లమెంటరీ బాధ్యత, సమర్థ ప్రతిపక్షమనే మూల సూత్రాన్ని స్పీకర్ విస్మరించారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్స్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్ క్వాలిఫికేష్ చట్టంలోని సెక్షన్ -12%దీ%లో ప్రతిపక్ష నేతను నిర్వచించారని, దీని ప్రకారం ఆ హెూదా పొందేందుకు తాను అర్హుడినని జగన్ స్పష్టం చేశారు. కాగా, ఈ వాజ్యంపై వాదనలు జరిగిన, తర్వాత కోర్టు నిర్ణయం వెలువడనుంది. దీంతో కోర్టు నిర్ణయంపై ఉత్కంఠ కొనసాగుతోంది.

## శ్రీ గంగా దుర్గా మారెమ్మ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ అన్నపూర్ణ దేవిగా అమ్మవారి దర్శనం



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ చిట్టినగర్ కుండల మార్కెట్ ప్రాంగణంలో ఉన్న శ్రీశ్రీశ్రీ గంగా-దుర్గా-మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానం లో దసరా ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం శ్రీ అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి ఉపాసకురాలు తమ్మిన రవీనా ఆధ్వర్యంలో మూడో రోజు అమ్మవారికి వేలాదిమంది భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఊహించని సంఖ్యలో పాల్గొని దేవాలయ ప్రాంగణాన్ని భక్తి భావంతో నింపారు. అమ్మవారి ఆలయ పరిసరాలు మంత్రోచ్చరణలతో, భక్తజనలతో మారుమ్రోగాయి. అమ్మవారిని శ్రీ అన్నపూర్ణ దేవి రూపంలో దర్శించుకోవడం భక్తులందరికీ ఆధ్యాత్మికానందాన్ని పంచింది. ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ హృదయాలు ఆనంద పరవశంతో మహెూత్సవం విజయవంతంగా నిర్వహించారు.

## శ్రీ చంద్రఘంట దేవిగా దర్శనమిచ్చిన శ్రీ దేవీ కరుమారి అమ్మన్ అమ్మవారు



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దేవి కరుమారి అమ్మ శక్తి పీఠంలో దసరా ఉత్సవాలు మూడోరోజు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పిండజప్ర వరారూఢా చండకో పాస్త్రకైర్యు తాప్రసాదం తనుతే మహ్యం చంద్రఘంటేతి విశ్రుతా అంటూ పూజారులు ధ్యానం చేయగా శ్రీ చంద్ర ఘంటా దేవిగా దర్శనమిచ్చిన అమ్మ వారి కోసం వేలాదిమంది భ క్తులు దర్శనానికి పోటెత్తారు. పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ కరుణ స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలు ఎంతో ఘనంగా భక్తుల మనో పీఠంపై ముద్ర వేస్తున్నాయి. భక్తులకు ఉదయం తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాదం వడ్డించారు.

# శ్రీ గాయత్రి దేవి అలంకారంతో దర్శనమిచ్చిన చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారు







**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 23: (వార్తా ప్రభ ప్రతినిధి)**దసరా మహెూత్సవాల సందర్భంగా బుధవారం చిట్టి నగర్ లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ గాయత్రి దేవి అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి దేవస్థానానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళాశ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ దసరా సందర్భంగా మూడవ రోజున సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ గాయత్రి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. ప్రతినిత్యం పలువురు ప్రముఖులు దేవస్థానానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారని వివరించారు. కాగా కమిటీ గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, సహాయం జాయింట్ సెక్రెటరీలు సీరం వెంకట్రావు, పొట్నూరి రాజా కమిటీ సభ్యులు కామందుల నరసింహారావు, మజ్జి శ్రీనివాసరావు, మజ్జి ఈశ్వరరావు, పోతిన ధర్మారావు, పోతిన సాంబశివరావు ,బంక హనుమంతరావు, పిళ్ళా విజయ్ తదితరులు పాల్గొని భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. ప్రతినిత్యం సాయంత్రం పూట శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తజనులకు కన్నుల పండుగగా జరుగుతుండటం విశేషం.

# నిరంతరం భక్తుల్లోనే..ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

**భక్తులతో మమేకమవుతూ ఏర్పాట్లపై అభిప్రాయాలు తెలుసుకుంటూ..**
**సమస్య ఏదైనా ఉంటే అక్కడికక్కడే సరిదిద్దుతూ..**
**భక్తుల మన్ననలు పొందుతున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ**





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దసరా మహెూత్సవాలకు చేసిన ఏర్పాట్లు బాగున్నాయా.. మీకు ఏమైనా ఇబ్బంది ఉందా.. ఇలా భక్తులతో మాట్లాడుతూ.. ఏవైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇచ్చి సరిదిద్దుతూ ముందుకు సాగుతున్నారు.. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ..అప్పుడు ఇప్పుడు అని కాదు. ఆ ప్రాంతం ఈ ప్రాంతం అని కాదు.. ప్రతిచోటకు చురుగ్గా కదులుతూ క్యూ లైన్ లలో సైతం భక్తులతో కలసి అడుగులు వేస్తూ ఏర్పాట్లపై అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. సమస్యలు ఏవైనా అక్కడికి అక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిఒక్కరికి సంతృప్తికరంగా అమ్మను దర్శించుకునేలా దిశా నిర్దేశం చేస్తున్నారు. 11 రోజులపాటు కొనసాగే శరన్నవరాత్రి ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అక్కడికక్కడే...అప్పటికప్పుడే... శాశ్వత పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ తీసుకుంటున్న చర్యలను భక్తులు ప్రశంసిస్తున్నారు. ప్రధానంగా దర్శనం కోసం భక్తులు వేచి చూచే సమయం తగ్గించడం... దర్శనానంతరం... లడ్డు ప్రసాదాల.. విక్రయ కేంద్రాల వద్ద రద్దీని నివారించడం... అన్న ప్రసాదం నిర్వహించే కేంద్రాలలో ఎటువంటి సమస్యలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. 36 సెక్టార్లలో వందల మంది సిబ్బంది మధ్య సమన్వయం సాధించి మహెూత్కృష్టమైన రాష్ట్ర పండుగను అమ్మవారిని దర్శించుకున్న ప్రతి ఒక్కరూ ఏడాది పొడవునా గుర్తుంచుకునేలా నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ తీసుకుంటున్న చర్యలను ప్రతి భక్తుడు అభినందించడం విశేషం

## దసరా శరన్నవరాత్రి మహెూత్సవాల బంధోబస్త్ నేపద్యంలో
# నిరంతర భక్తుల సేవలో ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్

**● కామాండ్ కంట్రోల్ రూం నుండి పర్యవేక్షిస్తూ బందోబస్త్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్న పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్.వి.రాజ శేఖర బాబు ● వృద్ధులు, దివ్యాంగులకు అమ్మవారి దర్శనం సాఫీగా జరగడానికి పోలీస్ సేవాధల్ ఏర్పాటు**







**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి మహెూత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ధర్శనంలో సామాన్య భక్తులకే పెద్దపీట వేయడమే లక్ష్యంగా చేసుకుని నగర పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్.వి.రాజ శేఖర బాబు అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని పటిష్టమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా అమ్మవారి దర్శనం కోసం ఎంతో వ్యయప్రయాసలు పడుతూ వచ్చే దివ్యాంగులు, వృద్దులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకోవాలనే సదుద్దేశంతో పోలీస్ సేవాధల్ ను ఏర్పాటు చేసి వృద్ధులు, దివ్యాంగులు అమ్మవారి దర్శనం చేసుకోవడంలో సహాయం చేస్తున్నారు. బుధవారం భారత ఉపరాష్ట్రపతి పర్యటన నేపధ్యంలో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు డ్రోన్ కెమెరాల ద్వారా కామాండ్ కంట్రోల్ నుండి పర్యవేక్షిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ తగు ఆదేశాలను జారీ చేశారు. సి.పి. ఆదేశాల ప్రకారం డి.సి.పి. శ్రీమతి కె.జి.వి.సరిత ఐ.పి.ఎస్. టెంపుల్ పైన ఏరియాలను స్వయంగా పరిశీలించి అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ బంధోబస్త్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం నగర పోలీస్ కమీషనర్ గారు పున్నమిఘాట్ నందు జరుగు విజయవాడ ఉత్సవ్ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి వస్తున్న నేపథ్యంలో సదరు పున్నమిఘాట్ ఏరియాలను పరిశీలించి ఎక్కడా ఎటువంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తూ బందోబస్త్ విధులు నిర్వహించాలని అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# అవగాహనతో పిసిఓడి సమస్యలు దూరం

**ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఏ ఇంద్రజ**



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 24:(వార్తా ప్రభ ప్రతినిధి)**సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, జీవనశైలి మార్చుకోవడం ద్వారా పిసిఓడి సమస్యల నుంచి విముక్తి పొందవచ్చని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎ. ఇంద్రజ అన్నారు. ఆయుష్ హాస్పటల్ సహకారంతో బుధవారం కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థినులకు పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఓడి) సమస్య గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాలీసిస్టిక్ ఓవరీ డిసీజ్ అనేది మహిళల్లో కనిపించే ఒక సాధారణ గైనకాలజికల్ సమస్య అని, ఈ సమస్య వల్ల గర్భాశయానికి ఇరువైపులా ఉండే అండాశయాలలో చిన్న చిన్న సిస్టులు ఏర్పడతాయన్నారు. ఫలితంగా హార్మోన్ల అసమతుల్యత వస్తుందని , దీనివల్ల నెలసరి చక్రం లో అవకతవకలు,అధిక రక్తస్రావం, దీర్ఘకాలిక రక్తస్రావం, బరువు పెరగడం, ముఖం, శరీరంపై అధిక రోమాలు రావడం మొటిమలు, చర్మ సమస్యలు గర్భధారణలో ఇబ్బందులువంటి సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. యువతిలో ఎక్కువగా కనిపించే పి.సి.ఓ.డి సమస్యకు కారణాలు, లక్షణాలు, నివారణా మార్గాలపై విశదీకరించారు. అనారోగ్యకరమైన జీవనశైలి, ఒత్తిడి, తప్పుడు ఆహారపు అలవాట్లు ఈ సమస్యను మరింత పెంచుతున్నాయని తెలిపారు. సమయానికి వ్యాయామం, సమతుల్యమైన ఆహారం, మానసిక ప్రశాంతతను కాపాడుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని విద్యార్థులకు వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు చక్కటి వివరణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి కృష్ణవేణి మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా ఆరోగ్య పరిరక్షణలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ప్రతి విద్యార్థిని శారీరక, మానసిక పరంగా బలోపేతం చేస్తాయని అన్నారు. వైస్ ప్రిన్సిపల్స్ పి ఎల్ రమేష్, డాక్టర్ కప్పగంతు రామకృష్ణ ఇంద్రజను సత్కరించారు. ఉమెన్ స్టడీస్ సెంటర్ సభ్యులు స్వాతి, గౌతమీదేవి కార్యక్రమాన్ని నిర్వహించారు.

# శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు బాగున్నాయి...

**- జగన్మాతను దర్శించుకున్న రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు**




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ రామచంద్ర మోహన్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ నేతృత్వంలో నవరాత్రి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లు చాలా బాగా చేశారని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురాం కృష్ణరాజు అన్నారు. బుధవారం ఆయన శ్రీ అన్నపూర్ణాదేవి అలంకృత జగన్మాతను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను వేద పండితులు అందజేశారు. ఆయనతోపాటు చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ కూడా జగన్మాతను దర్శించుకున్నారు.

## విజయవాడ ఉత్సవ్‌కు నందమూరి బాలకృష్ణకు ఆహ్వానం

**కమిటీ సభ్యులతో కలిసి ఆహ్వాన పత్రిక అందజేసిన ఎంపీ కేశినేని శివనాథ్..**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరంలోని మురళి ఫార్చ్యూన్‌లో ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ఎంపీ కేశినేని శివనాథ్ తో కలిసి "విజయవాడ ఉత్సవ్" కమిటీ సభ్యులు ముత్తవరపు మురళీ కృష్ణ,అనిల్ సుంకర బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ విజయవాడ ఉత్సవ్ వైభవం, సాంస్కృతిక ప్రాధాన్యం, నగర ప్రజల ఆత్మీయత గురించి వివరించారు. రాష్ట్ర ప్రజలకు వినోదం, ఆధ్యాత్మికం, సాంస్కృతిక రంగాల్లో కొత్త వెలుగులు నింపుతున్నవిజయవాడ ఉత్సవ్ విశిష్టతను బాలకృష్ణకు తెలియజేశారు. విజయవాడ ఉత్సవ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనవలసిందిగా బాలకృష్ణను కోరుతూ ఆహ్వాన పత్రికను ఎంపీ కేశినేని శివనాథ్ తో కలిసి ఉత్సవ్ కమిటీ సభ్యులు అందజేశారు. విజయవాడ ప్రజలతో కలసి ఈ వేడుకల్లో భాగమవ్వడం ఆనందంగా ఉంటుందని హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సానుకూలంగా స్పందించారు. ఉత్సవ్ వేడుకల్లో తాను తప్పకుండా పాల్గొంటానని బాలకృష్ణ తెలిపారు.

## శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మూడవ రోజు శ్రీ కాశి అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనం



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మూడవ రోజు బుధవారం శ్రీ కాశి అన్నపూర్ణ దేవిగా భక్తులకు అమ్మవారి దర్శనం ఇచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి, చింతలపాటి నాగ వెంకట పవన్ కుమార్ శర్మ, తెలిపారు. భీమనవారిపేట పాల ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్నటువంటి శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు, అనంతరం వారు మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మూడవ రోజు శ్రీ కాశి అన్నపూర్ణ దేవిగా భక్తులకు అమ్మవారి దర్శనం ఇచ్చారని ఈ సందర్భంగా వారు తెలిపారు, నవరాత్రులను పురస్కరించుకొని ఆలయంలో , , భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చినటువంటి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ వారి పర్యవేక్షణలో తీర్థ ప్రసాదాలను అందజేశారు, ఈ సంవత్సరం దసరా 11 రోజులు రావడంతో 11 రోజులు 11 అవతారాలతో అమ్మవారు భక్తులకు దర్శనం ఉన్నారని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓసీ అందజేత

**ఎన్డీఏ కార్యాలయంలో ఎల్. ఓ.సీ అందజేసిన ఏపీ తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్ డీ విల్సన్, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్,కూటమి నేతలు**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన ఎల్. ఓ. సీ.( లెటర్ ఆఫ్ క్రెడిట్) ను భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలోఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్ డీ విల్సన్, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి అందజేశారు. 40 వ డివిజన్ అవుట్ ఎజెన్సీ ప్రాంతానికి చెందిన జంగం హనోక్ (20) అక్యూట్ అపెండిసైటిస్ తో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనకి మరింత మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా రూ 1 లక్ష 82వేల ఎల్.ఓ. సీ ను, బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. త్వరితగతిన ఎల్.ఓ. సీ మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ పేట బీజేపీ మండల అధ్యక్షులు ప్రవీణ్ రాంక , కూటమి నేతలు మధు మస్తాన్, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా నూతన జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన నవీన్.



**మచిలీపట్నం సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ (ప్రతినిధి)**రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై దృష్టి సారించి జిల్లా ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషి చేస్తానని నూతన సంయుక్త కలెక్టర్ మల్లారపు నవీన్ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా నూతన సంయుక్త కలెక్టర్ గా రాష్ట్ర ప్రభుత్వంచే ఇటీవల నియమితులైన మల్లారపు నవీన్ బుధవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్లో సంయుక్త కలెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్ పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరాం ప్రసాద్, డీఎస్ఓ మోహన్ బాబు, బందరు ఆర్డీఓ స్వాతి, మార్కెటింగ్ ఏడి నిత్యానందం తదితర జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో రాధిక, పలువురు కలెక్టరేట్ సిబ్బంది నూతన సంయుక్త కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎవరికీ అప్పగించిన పనులు వారు సజావుగా చేయాలని కలెక్టరేట్ సిబ్బందికి సంయుక్త కలెక్టర్ సూచించారు. అదనంతరం సంయుక్త కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తాను 2019 బ్యాచ్ ఐఏఎస్ అధికారినని,రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలైన ప్రజా సమస్యలు, భూ సమస్యలు, ధాన్యం సేకరణ సమస్యలను ప్రభుత్వ నియమాల ప్రకారం శక్తి వంచన లేకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, జిల్లాలోని ప్రభుత్వ అధికారులందరూ, కలెక్టరేట్ సిబ్బంది, పాత్రికేయులు అందరి సహకారంతో ప్రజలకు మంచి సేవలు అందించే అవకాశం లభిస్తుందని కోరుకుంటున్నానన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులు అడిగిన కొన్ని ప్రశ్నలకు సంయుక్త కలెక్టర్ సమాధానం చెబుతూ తన స్వస్థలం తిరుపతి అని, అక్కడే విద్యాభ్యాసం చేశానని, సత్యసాయి జిల్లా పెనుగొండలో సబ్ కలెక్టర్ గా పనిచేశానని, శ్రీకాకుళం జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ గా శిక్షణపొంది అక్కడే సంయుక్త కలెక్టర్ గా కూడా పనిచేశానన్నారు. సి ఆర్ డి ఏ లో అదనపు కమిషనర్ గా పనిచేశామన్నారు. ప్రస్తుతం రెండవసారి సంయుక్త కలెక్టర్ గా కృష్ణాజిల్లాలో పదవి బాధ్యతలు స్వీకరించామన్నారు. సిఆర్డిఏ పరిధిలో కృష్ణాజిల్లాలో కొన్ని ప్రదేశాలు వస్తాయని వాటి గురించి కొంతవరకు తెలుసునని సంయుక్త కలెక్టర్ చెప్పారు.తదుపరి సంయుక్త కలెక్టర్ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కలెక్టరేట్లోని వారి చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## మున్సిపల్ కార్యాలయంలో మీకోసం విభాగం.

**మచిలీపట్నం సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం నగర పరిధిలో త్రాగునీటి సమస్యలు పరిసరాల అపరిశుభ్రత కాలువల శుభ్రం చేయకపోవడం వీధి దీపాలు వెలగకపోవడం రోడ్డు మీద ఆక్రమణ సమస్యలు మొదలైన నగరపాలక సంస్థకు చెందిన సమస్యలు వచ్చినప్పుడు మచిలీపట్నం నగరపాలక సంస్థ మీకోసం విభాగమునకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని నగర కార్పొరేషన్ కమిషనర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మీకోసం ఫోన్ నెంబర్ 9849907989. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు ఫోన్ ద్వారా నగరపాలక సంస్థ మీకోసం విభాగమునకు ఫిర్యాదు చేయొచ్చని ప్రజలకు తెలిపారు. ఫిర్యాదు చేసిన వెంటనే సమస్య పరిష్కారం కు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అన్ని దినములలో మీకోసం విభాగం ఉదయం 6:00 నుండి సాయంత్రం 8 గంటల వరకు పని చేస్తుందని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ రెవిన్యూ కౌంటర్ ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిరంతరం పని వేళలలో పని చేయునని తెలిపారు. మధ్యాహ్న భోజన విరామ సమయం కూడా లేకుండా పనిచేస్తుందని అలానే ఆస్తిపన్నులు, ఖాళీ స్థలం పనులు, వాటర్ చార్జీలు చెల్లించవలెనని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జాతీయ సాంస్కృతిక ఉత్సవాలకు రండి

**డాక్టర్ పాపినేని శివశంకర్ ని ఆహ్వానించిన కలిమిశ్రీ**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 24 : (వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ , జిల్లా యంత్రాంగం సారధ్యంలో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ నిర్వహణలో నవంబరు 22, 23 తేదీలలో విజయవాడలో రెండు రోజులపాటు పూర్తి సాహిత్య, సాంస్కృతిక సంబరంగా జరుగబోతున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలకు హాజరై నేటి సాహితీరంగ యువతరాన్ని మార్గనిర్దేశనం చేయవలసిందిగా కోరుతూ సుప్రసిద్ధ సాహితీవేత్త, విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శవశంకర్ ని జాతీయ సాంస్కృతిక ఉత్సవాల కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ గుంటూరులోని ఆయన స్వగృహంలో కలిశారు. తెలుగు రచయితలు, కవులు, కళాకారులు, కార్టూనిస్టులు పాల్గొంటున్న రెండు రోజుల వేడుకల్లో చేయబోయే కార్యక్రమాల ప్రాధమిక సమాచారాన్ని కలిమిశ్రీ డాక్టర్ శివశంకర్ కి వివరించారు. కమిటీ కీలక బాధ్యులు బండికల్లు జమదగ్ని, చొప్పా రాఘవేంద్రశేఖర్ ఈ కలయికలో పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటగా సీఐలేజ్ మొక్కజొన్న సాగు





**చేజర్ల సెప్టెంబరు 24 (వార్తాప్రభ)** మండలంలోని వావిలేరు పాడేరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి మాట్లతు రైతులను ఉద్దేశించి ప్రత్యామ్నాయ పంటగా సీఐలేజ్ మొక్క జొన్న పంటను సాగు చేసి 75 రోజులలో తక్కువ ఖర్చు తో అధిక ఆదాయము పొందా వచ్చునని తెలియ చేసినారు. దీనికి సంబంధించి జిల్లాలో ట్రూ మీల్ కంపెనీ వారు ఒప్పంద ప్రాతిపదికన రైతుల దగ్గర టన్ను ఒక్కింటికి రూ. 2250/ చొప్పున ఇస్తున్నారనియు సగటున ఒక ఎకరమునకు సాగు ఖర్చు పోను రూ. 20000/ నికర ఆదాయము వస్తుందని తెలియచేసారు. కాబట్టి జిల్లాలోని రైతాంగం సైలేజి మొక్కజొన్న సాగుపై దృష్టి సారించాలని తెలియచేసారు. అధిక యూరియా వాడకం వలన కలుగు పరిణామాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా ఎడిఎ నర్సోజి మాట్లతు అధికంగా యూరియా వినియోగం వలన నేలలో ఆమ్లతత్వం పెరిగి పోషకాలు అందుబాటులో లేకుండా ఉంటాయి. నీటి మరియు నేల కాలుష్యం అధికమవుతుంది. పైరు ఎపుగా పెరిగి చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయని తద్వారా పురుగుమందులు తెగులు మందులు అధికంగా వాడవలసి వస్తుందని తెలియజేశారు. హిమబిందు రైతులతో మాట్లాడుతూ భూమి లేని కౌలు రైతులు సిసిఎస్ కార్డు పొందడం వలన ప్రభుత్వం పథకాలు రాయితీని పొందవచ్చు అని తెలిపారు. అందువలన కౌలు రైతులు తప్పనిసరిగా సిసిఆర్ కార్డు పొందాలని ఆమె సూచించారు. సైలె జి మొక్కజొన్న సాగుపై సందేహాలు ఉన్నచో విశ్రాంత సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. శ్రీనివాస్ (9490247908)ని సంప్రదించాలని మనవి చేయుచున్నాను. ఈ కార్యక్రమం లో నెల్లూరు ఎడిఎ బి. శ్రీదేవి గ్రామ సర్పంచ్ జి. రాంబాబు విఎఎ సూర్య నారాయణ హాజర్త మరియు రైతులు పాల్గొన్నారు.

## స్వస్థ్ నారి - సశక్త్ పరివార్" ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న నాగేశ్వరరెడ్డి,



**రెడ్డిగూడెం సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి):**రెడ్డిగూడెం మండలంలో రెడ్డిగూడెం2 లో మహిళల ఆరోగ్యాన్ని కాపాడటానికి ప్రత్యేకంగా "స్వస్త్ నారి స శక్త్ పరివార్" ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్థులు, వైద్యులు, స్థానిక నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ముప్పిడి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న మహిళే కుటుంబానికి బలం అవుతుంది. కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలంటే మహిళలు ఆరోగ్యంగా ఉండాలి" అని అన్నారు. ప్రతి కుటుంబం సరైన ఆహారం తినడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మరియు అవసరమైతే వైద్య పరీక్షలు చేయించుకోవడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పౌష్టికాహారాన్ని పెంచే పంటలు పండిస్తే కుటుంబానికి ఆరోగ్యం, రైతుకి ఆదాయం వస్తుందని చెప్పారు. నాగేశ్వరరెడ్డి "ఆరోగ్యం కోసమే సంపద సంపద కోసమే కాదు ఆరోగ్యం" అని గుర్తుచేస్తూ, ఆరోగ్యంపై అందరూ శ్రద్ధ వహించాలని కోరారు. ఈ ఆరోగ్య శిబిరం వల్ల మహిళలకు ఉపయోగకరమైన సమాచారం అందింది. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని చాలా సంతోషంగా స్వాగతించారు. ఈ కార్యక్రమం లో టీడీపి నాయకులు ఉయ్యూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిలకలదిండిలోని సైక్లోన్ సెంటర్లో మత్స్యకారులకు పోర్టు ట్రస్ట్ అవగాహన సదస్సు.





**మచిలీపట్నం సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం గిలకలదిండి సైక్లోన్ భవనంలో ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోర్ట్ వర్కర్స్ కు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ షేక్ ఖలీఫతుల్లా భాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులు, పోర్ట్ కార్మికులకు అనేక పథకాలు అందిస్తున్నాయి అని అన్నారు. మత్స్యకారులు, కార్మికులకు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మత్స్యకారులు, పోర్టు కార్మికులకు శ్రేయస్సుకు రాష్ట్రంలో ఉన్న పోర్టులను సందర్శించి మత్స్యకారుల యొక్క సమస్యలను తెలుసుకుంటున్నామని అన్నారు. మత్స్యకారులు సమస్యల పరిష్కారం ప్రధాన లక్ష్యం అని అన్నారు. డీజిల్, వలలు, లైఫ్ జాకెట్స్ వంటి వాటిపై సబ్సిడీలు అందటంలేదని మత్స్యకారులు తమ దృష్టికి తీసుకువచ్చారని వాటిని త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. డీజిల్ మీద సబ్సిడీ అందకపోవడం కేవలం దళారులవల్లె జరుగుతోంది అని ఈ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకువెళ్తాను అని భరోసా కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందవలసిన ఫలాలు వారికి చేరువ అయ్యేటట్లు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షులు స్టేట్ డైరెక్టర్ పిన్ని సాంబశివరావు, గిలకలదిండి పోర్ట్ ఇంచార్జ నదకుదుటి సురేష్ కుమార్, డివిజన్ ఇంచార్జ వాడపల్లి రమేష్,బలగం సుబ్రహ్మణ్వరరావు,మోకా నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కైకలూరులో పి-4 శిక్షణా తరగతులు.

***పి-4 కార్యక్రమం పేదరిక నిర్మూలనలో కీలకపాత్ర పోషిస్తుంది - ఎంపీపీ.***



**కైకలూరు సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పి-4 కార్యక్రమంపై శిక్షణా తరగతులు బుధవారం కైకలూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు అడవి వెంకట కృష్ణమోహన్ శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సమాజంలోని ఆర్థికంగా బలమైన వారు, బలహీన వర్గాలకు చేయూతనిచ్చి వారిని సమాజంలో ఉన్నత స్థితికి చేర్చాలని పిలుపునిచ్చారు. పి-4 కార్యక్రమం పేదరిక నిర్మూలనలో కీలకపాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి యద్దనపూడి రామకృష్ణ, వ్యవసాయ అధికారి కె. బాలశంకర్ రావు, యంగ్ ప్రొఫెషనల్ ఎం. స్వరూప్, గ్రామ సచివాలయ సిబ్బంది, సెక్రటేరియట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం.





**మచిలీపట్నం సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**డ్రగ్స్ రహిత సమాజం స్థాపన ప్రతి ఒక్కరి బాధ్యత అని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి లక్ష్మి అన్నారు. స్థానిక లేడీ యాంప్తిల్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ సేవ దినోత్సవం (ఎన్ఎస్ఎస్ డే )ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు డ్రగ్స్ వ్యతిరేక అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సేవ భావం కలిగి ఉండాలి అని ముఖ్యంగా బాలికలు భవిష్యత్తులో మంచి స్థానానికి చేరుకొంటారని అన్నారు. ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాధ్ బాబు మాట్లాడుతూ ఇటువంటి అవగాహనా ర్యాలీ లు నిర్వహించడం ప్రజల్లో చైతన్యం తీసుకోని రావడానికి ఎన్ ఎస్ ఎస్ యూనిట్లు కృషి చేస్తున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమం లో అధ్యాపకులు మమత, హిరణ్మయి ,పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ వన్యప్రాణుల వేట పై అధికారుల విచారణ

**● మూలపాడు అడవిలో పరిశీలించిన అటవీ శాఖ అధికారులు ● వేట జరిగినట్లు ఆధారాలు లేవన్న డిఎఫ్ఓ ● అధికారుల మాటల పై పలు అనుమానాలు**







**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 24(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి రిజర్వాయర్ ఫారెస్ట్ లో వన్యప్రాణుల వేట జరిగినట్లు మీడియాలో కథనాలు రావడంతో స్పందించిన అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. యదేచ్ఛగా వన్యప్రాణుల వేట పేరు తో వార్తా ప్రభలో కూడా కథనం ప్రపంచమైంది. జిల్లా ఫారెస్ట్ అధికారి సతీష్, ఫారెస్ట్ రేంజర్స్ శ్రీనివాస్ రెడ్డి స్వయంగా విచారణ చేపట్టారు. ఫారెస్ట్ గార్డులను మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా సంబంధిత లొకేషన్ కి పంపి విచారించారు. పూర్తి విచారణ అనంతరం జిల్లా అడవి శాఖ అధికారి సతీష్ మీడియాతో మాట్లాడుతూ పత్రికలలో మీడియాలో వచ్చిన కథనాలు ఆధారంగా కొండపల్లి రిజర్వాయర్ ఫారెస్ట్ లో వన్యప్రాణుల వేట పై విచారణ జరిపామని, వేట జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని అన్నారు. పాత వేటగాళ్లు, మేకల కాపర్లు, అటవీ పరిసర ప్రాంత గ్రామా ప్రజలను సైతం విచారించినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చిన ఫోటోల ఆధారంగా ప్రచారం జరిగిందని దానిపై సైబర్ క్రైమ్ కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. గతంలో ఎక్కడో జరిగిన ఫోటోలను ఇక్కడ జరిగినట్లు ప్రచారం చేశారని , దీని వెనక బటర్ ఫ్లై పార్క్ లో గతంలో పనిచేసిన వ్యక్తి పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నామని అన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుందని చెప్పారు. కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ లో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వహిస్తున్నారని అన్నారు. వేట జరిగినట్లు, జంతువులకు ఉచ్చు బిగించినట్లు సమాచారం ఉంటే వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మూలపాడు రేంజ్ శివ ప్రసాద్ రెడ్డి, ఇతర అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**అధికారుల మాటలపై పలు అనుమానాలు** అధికారులు విచారణ అనంతరం చెప్పిన మాటలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు వేట జరిగిందా లేదా, అయితే లభించిన జంతువుల కళేబరాలు ఎక్కడో అధికారులు కచ్చితంగా చెప్పలేకపోయారు. ఉద్యోగి ప్రచారం చేస్తే గతంలో ఇక్కడే జరిగిన సంఘటనలేనా..? మరి అలాంటప్పుడు ఏం చర్యలు తీసుకున్నారు మీ అంశాలపై అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు.

## ఈనెల 26 న డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాలలో జాబ్ మేళా

**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్24( వార్తా ప్రభ ప్రతినిధి):**ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 26వ తేదీ శుక్రవారం రోజు డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహించబడుతుందని డిగ్రీ మరియు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ మస్తాన్ వలి, జాఫర్ సాదిక్ లు తెలిపారు. ఈ మేళాలో సుజ లాన్ఎనర్జీ లిమిటెడ్ ,వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ,టెక్నో టాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ,ఎస్ వి గ్లోబల్ సొల్యూషన్స్ మొదలగు 12 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. నిరక్షరాస్యుల నుంచి డిగ్రీ, పీజీ చదివిన అభ్యర్థులు ఎవరైనా ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చు అని తెలిపారు. విద్యార్హతలు ఉద్యోగ స్థాయిని బట్టి జీతం పదివేల నుండి 40 వేల రూపాయల వరకు ఉంటాయన్నారు. ఇంటర్వ్యూలో పాల్గొనదలచిన అభ్యర్థులు 26 సెప్టెంబర్ శుక్రవారం ఉదయం 9 గంటలకు కళాశాల ప్రాంగణంలో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ కు ఆధార్ తో లింక్ చేయబడిన ఫోన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అభ్యర్థులు తమతోపాటు రెస్యూమ్ ,విద్యార్హత సర్టిఫికెట్లు ,ఆధార్ ,పాన్ కార్డ్ ,బ్యాంక్ పాస్ బుక్ మొదటి పేజీ ,పాస్పోర్ట్ ఫోటోలు ,బైక్ ఆర్సి, డ్రైవింగ్ లైసెన్సు తెచ్చుకోవాలన్నారు. ఇతర వివరాలకు క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు అశోక్ : 8247766718లావణ్య: 6301990597

## పొత్తం చెప్పిన సత్యాలు





పెంచుకోకు ద్వేషము
అగును చివరికి విషము
ప్రేమ గుణం శ్రేష్టము
కల్గియున్న క్షేమము
శత్రుత్వమే చేటు
బంధాలపై వేటు
క్షమాగుణమే ఘనము
అక్షరాలది నిజము
లేకుంటే విలువలు
శవంతో సమానము
అవి ఉంటే బ్రతుకులు
దేదీప్యమానముజి
స్నేహమనే బంధము
అత్యంత పవిత్రము
మరువకు జీవితాన
గుర్తించుము సతతము

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు, 9966414580

## కైకలూరు,గుడివాడ రైల్వే గేట్ 7 రోజులు మూసివేత.

**వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలి.**



**కైకలూరు సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)** కైకలూరు,గుడివాడ రైల్వే మార్గంలోని ఎల్సి నెం 79 వద్ద ట్రాక్ మరమ్మత్తు పనులు ప్రారంభమైనందున గేట్ను సెప్టెంబర్ 24 నుండి 30 వరకు మొత్తం 7 రోజులు మూసివేయనున్నట్లు పోలీసులు ప్రకటించారు. ఈ సందర్భంగా వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. పోలీసులు విడుదల చేసిన ప్రకటన ప్రకారంముదినేపల్లి నుండి కైకలూరుకు వచ్చే వాహనదారులు ముదినేపల్లి-సింగరాయపాలెం-కోరుకొల్లు మార్గం ఉపయోగించాలి. కైకలూరు నుండి గుడివాడ వెళ్లే వాహనదారులు కైకలూరు మార్కెట్ యార్డ్-కోరుకొల్లు-సింగరాయపాలెం మార్గం వినియోగించాలి. ఏలూరు నుండి గుడివాడ వెళ్లే వాహనదారులు దెయ్యంపాడు-మండవల్లి మార్గం ద్వారా ప్రయాణించాలి. ప్రజలు ఈ మార్గదర్శకాలను గమనించి సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# లోక్ కళ్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**- కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు**




**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి):** వీధి వ్యాపారులు లోక్ కళ్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. కొండపల్లి పట్టణ పరిధిలోని ఇబ్రహీం పట్నం పంచాయతీ కార్యాలయంలో మెప్మా పర్యవేక్షణలో బుధవారం లోక్ కళ్యాణ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి వీధి వ్యాపారి ఈ పథకంలో బ్యాంకు ద్వారా రుణం తీసుకుని క్రమ పద్ధతిలో జమ చేసుకోవాలని సూచించారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మురళీకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నిజమైన చిరు వ్యాపారులకు ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. ఈ పథకం ద్వారా చిరు వ్యాపారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు మాట్లాడుతూ చిరు వ్యాపారులు అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చుకొని వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. వారికోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్వానిధి పథకం ద్వారా రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఈ మేళాలో వీధి వ్యాపారులు వారి కుటుంబ సభ్యులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వ్యాపారులు రిజిస్ట్రేషన్ కౌంటర్ లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి, మెప్మా ఐబీ సుధారాణి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పి.శ్రీధర్, సీఈవోలు వెంకయ్య, వెంకట నరసమ్మ, ఆర్పీలు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి దేవస్థానం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పణ



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అన్నపూర్ణ దేవిగా దర్శనమిస్తున్న దుర్గా అమ్మవారికి శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలను, సారెను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ కుమార్ రెడ్డి, శ్రీకాళహస్తి దేవస్థాన ఈవో టి. బాపిరెడ్డి సమర్పించారు. శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయం నుంచి అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించడం ఆనవాయితీ అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ కుమార్ రెడ్డి తెలిపారు. వేద పండితులు, మహిళలతో కలిసి పట్టు వస్త్రాలు, సారె సమర్పించడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండి, అభివృద్ధి పథంలో సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా విఐపి లు నిర్దేశిత సమయంలోనే దర్శనం చేసుకోవాలని సూచించారు.

# ఆహ్లాదంగా.. విజయ నర్తనం

**ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు**





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి):** స్థానిక పవిత్ర సంగమంలో కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విజయ నర్తనం కొండపల్లి ఉత్సవ్ వేదికపై ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. ఈ వేదికపై శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు మూడో రోజుకు చేరాయి. బుధవారం రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. సిహెచ్.హనీషా బృందం ఫ్యూజన్, రింగ్ డ్యాన్స్, క్లాసికల్ డ్యాన్స్, తన్మయి నృత్య బృందం వేంకటేశ్వర స్వామి కల్యాణం సినీ క్లాసికల్ సాంగ్స్, పావని బృందం ఫోక్ డ్యాన్స్, సిల్వెస్టర్ మిమిక్రీ, వెంట్రిలాక్యుజం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం, సాయంత్రం అమ్మ వారి విగ్రహానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కూటమి నాయకులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో ఆరోగ్యకరమైన జీవితం

**బండారులంకలో వైద్య శిబిరం**

**అమలాపురం సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి):**మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవితం జీవించ వచ్చు అని గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత పేర్కొన్నారు. అమలాపురం మండలం బండారులంక గ్రామంలో స్వస్తి నారీ స్వసస్థి పరివార అభియాన్ వైద్య శిబిరం గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపచ్చు అన్నారు. అలాగే రోగులకు కొన్ని రకాల వైద్య పరీక్షలు,క్యాన్సర్,బిపి షుగర్,విధ రకాల ఆరోగ్య సమస్యలపై వైద్యులు ప్రజలకు సూచనలు ఇచ్చారు. మందులను ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు, మాజీ జెడ్పీటీసీ చింతా శంకర మూర్తి, కొండరాజు, కాసిన బాబి, చింతపట్ల మోహన ,మల్లవరపు ఏడుకొండలు, వాసా భీమ శంకరం ,గ్రామ సచివాలయం కార్యదర్శి కే.శ్రీనివాస్, వైద్య అధికారి డా. గౌతమి స్థానిక మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి, పోషకాహారాన్ని గర్భిణీ స్త్రీలకు పంపిణీ చేశారు.

# 216 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం... ఆర్.ఎం.పి వైద్యుని మృతి..



**కృత్తివెన్ను సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి)** 216 జాతీయ రహదారి కృత్తివెన్ను మెయిన్ సెంటర్ లో బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. కృత్తివెన్ను గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు తెలగంశెట్టి వెంకట రమణ నాగేశ్వరరావు(58) దుర్మరణం చెందారు. పాలకొల్లు నుంచి విజయవాడ వైపుకు వెళుతున్న ఏ. పి40 ఎఫ్ ఎం 4468 నెంబర్ గల మహేంద్ర వాహనం రమణను ఢీ కొట్టింది. గమనించిన స్థానికులు స్థానికంగా ఉన్న హాస్పిటల్ కు తీసుకుని వెళ్ళగా అప్పటికే మృతి చెందాడు అని నిర్ధారించారు. ఈయన మండలంలో మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్న ఆర్ఎంపి వైద్యుడు. వైద్యం చేయడమే తప్ప డబ్బుల అడగడం తెలియని మంచి వైద్యుడు అని, డబ్బులు ఇస్తే తీసుకుంటారు లేకపోతే వెళ్ళిపోయే మంచి మనిషి అని స్థానికులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఈయనకు భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇంట్లో శుభకార్యం ఉంది ఈరోజు హాస్పటల్ కి వద్దు అని భార్య ఎంత చెప్పిన వినకుండా హాస్పిటల్ శుభ్రం చేసి వస్తాను అని చెప్పి వెళ్లిన మనిషి ఇలా విగత జీవిగా పడి ఉండడాన్ని చూసిన భార్య పిల్లలు రోధిస్తుంటే వారిని ఓదార్చడం ఎవరి తరము కావడం లేదు. వందల సంఖ్యలో ప్రజలు మృతదేహాన్ని సందర్శించడంతోనే తెలుసుకోవచ్చు ఆయనకు ఎంత మంచి మనిషో!! రమణ మరణంతో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురు ప్రముఖులు రాజకీయాలకు అతీతంగా ఆయనకు మృతికి సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని

# ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే కామినేని.




**కైకలూరు సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)**దేశ ఉపరాష్ట్రపతి శ్రీ సి.పీ. రాధాకృష్ణన్ ఈరోజు విజయవాడ విమానాశ్రయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ పుష్పగుచ్ఛంతో ఉపరాష్ట్రపతికి అపూర్వ స్వాగతం పలికారు.డా. కామినేని మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పర్యటన రాష్ట్రానికి గౌరవకారణమని, ఆయన అనుభవం, మార్గదర్శనం సమాజానికి మేలుచేస్తుందని అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే సహకారంలో ఉపరాష్ట్రపతి భవనం పాత్ర కీలకమని అభిప్రాయ పడ్డారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధి కారులు పాల్గొని ఉపరాష్ట్రపతిని ఆత్మీయంగా ఆహ్వానించారు. ఉపరాష్ట్రపతి తో భేటీ అయిన నాయకులు పలు అభివృద్ధి అంశాలపై చర్చించగా, ఆయన రాష్ట్ర అభివృద్ధికి ఎల్లప్పుడూ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చినట్లు సమాచారం.విమానాశ్రయ ప్రాంగణం ఆత్మీయ వాతావరణంలో నిండిపోగా, ఉపరాష్ట్రపతి రాకను చూసేందుకు పలువురు ప్రజలు కూడా తరలివచ్చారు.

# టిడిఆర్ బాండ్ల కుంభకోణం చేపట్టిన వారిపై చర్యలు చేపట్టాలి

**శాసనసభలో ప్రస్తావించిన కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**



**కాకినాడ సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గత వైసీపీ ప్రభుత్వ పాలనలో కాకినాడ నగరం నందు ప్రభుత్వ భూములపై టిడిఆర్ బాండ్ల మంజూరు చేయించి దోచుకున్న వారిపై చర్యలు చేపట్టాలని కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు బుధవారం శాసనసభలో ప్రస్తావించారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి పాలకులు కాకినాడ నగరంలో ప్రభుత్వ భూములపై టిడిఆర్ బాండ్లు మంజూరు చేయించుకుని కార్పొరేషన్ సొమ్ములను దుర్వినియోగం చేశారని, టిడిఆర్ బాండ్ల కుంభకోణంపై అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అప్పటి వైసిపి ప్రభుత్వం అధికారులను సస్పెండ్ చేయడం,బదిలీలు చేయడం జరిగింది తప్ప టిడిఆర్ బాండ్లు మంజూరు చేయించుకున్న వారిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత టిడిఆర్ బాండ్ల కుంభకోణంపై విజిలెన్స్ దర్యాప్తు కూడా చేయడం జరిగిందని, కానీ నేటికీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు కావస్తున్న టిడిఆర్ బాండ్ల కుంభకోణం దోషులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, టిడిఆర్ బాండ్ల కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆహార ధాన్యాల అక్రమ రవాణాపై ప్రభుత్వం దృష్టి.

**కైకలూరు ఘటనపై త్వరలో కేసులు నమోదు చేస్తాం- మంత్రి నాదెండ్ల మనోహర్**



**కైకలూరు సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)**రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పిడిఎస్) ద్వారా సరఫరా చేయాల్సిన బియ్యం అక్రమంగా మార్కెట్లకు మళ్లిపోతున్నట్టు వెలుగులోకి వచ్చింది. ఇందులో భాగంగా కైకలూరు నుండి రూ.5.45 కోట్ల విలువైన బియ్యం పక్కదారి పట్టినట్టు అధికారులు గుర్తించారు. అనిరాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. వివరాల ప్రకారంమొత్తం రూ.234 కోట్ల విలువైన సుమారు 5.65 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అక్రమ రవాణా జరిగినట్టు దర్యాప్తులో బయటపడింది. కైకలూరులోని ఎంఎల్ఎస్ పాయింట్ నుండి రూ.5.45 కోట్ల బియ్యం మాయం అయినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయని తెలిపారు.ఈ అక్రమాల్లో రైస్ మిల్లర్లు, మధ్యవర్తులు, కొంతమంది బాధ్యత వహించాల్సిన అధికారుల పాత్ర ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుగుతోందని, త్వరలోనే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.ప్రభుత్వం పేదలకు అందించాల్సిన ధాన్యం మధ్యలోనే దారి మళ్లించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రజా సంక్షేమ పథకాలపై ఇలాంటి మోసాలు చేయబోయే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రభుత్వం హెచ్చరించింది.

# ఏపిఐడిసి డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన అంకెం ఇందిరా ప్రియదర్శిని



**విజయవాడ (జి.కొండూరు):సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన ఎన్టీఆర్ జిల్లా, మైలవరం నియోజకవర్గం, జి.కొండూరు మండలం, జి.కొండూరు గ్రామానికి చెందిన అంకెం ఇందిరా ప్రియదర్శిని బుధవారం భాద్యతలు చేపట్టారు. విజయవాడ ఇరిగేషన్ కార్యాలయంలో ఏపిఐడిసి డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ఇందిరా ప్రియదర్శిని తనకు ఈ అవకాశాన్ని కల్పించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, మంత్రి నారా లోకేష్, మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) కి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇరిగేషన్ రంగ, రైతుల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తాన ని అన్నారు.అలాగే పార్టీ పార్టీ పటిష్టత కోసం శ్రామిస్తానని పేర్కొన్నారు.

# తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ పై అవగాహన సదస్సు.



**కృత్తివెన్ను సెప్టెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బంటుమిల్లి లో బుధవారం తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్ యూ భాను ప్రసాద్ ఆధ్వర్యంలో బంటుమిల్లి పట్టణములో గల కిరాణా మరియు క్లాత్ వర్తకులతో సవరించిన జీఎస్టి పై తునికల కొలతల శాఖ పాత్ర పై అవగాహనా సదస్సు ను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిన సందర్భంగా ఏ ఏ వస్తువులపై ధరలు తగ్గాయి, ఏ వస్తువులపై ధరలు నిలకడగా ఉన్నాయి అనే దాని గురించి వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. వ్యాపారస్తుడు అవగాహన కలిగి ఉండటం వలన వినియోగదారునికి అవగాహన కల్పించడానికి సులువుగా ఉంటుందన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని భానుప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి కి సంబంధించిన వ్యాపారస్తులు పాల్గొన్నారు....

# ఆందోళన కలిగిస్తున్న విద్యార్థుల ఆత్మహత్యలు

(సి.హెచ్.ప్రతాప్)

విద్యా మందిరాలలో విషాద ఛాయలు: యువత ఆత్మహత్యలకు కారణాలు, పరిష్కారాలుభారతదేశం యువశక్తికి నిలయమని గర్విస్తున్న తరుణంలో, విద్యార్థుల ఆత్మహత్యలు అనే భయంకరమైన వాస్తవం మనల్ని కలవరపెడుతోంది. తమ కలల సాకారానికి చదువును ఆశ్రయించిన యువత, అకస్మాత్తుగా తమ జీవితాలను ముగించుకోవడానికి మొగ్గు చూపడం సమాజానికి ఒక హెచ్చరిక. 2022 లో వెలువడిన ఒక అధ్యయన సంస్థ నివేదిక ప్రకారం ఆ సంవత్సరంలో 13,000 మందికి పైగా విద్యార్థులు తమ ప్రాణాలు తీసుకున్నారు. అంటే ప్రతిరోజు 35 మంది యువకులు నిరాశతో అసువులు బాస్తున్నారు. ముఖ్యంగా కోటా వంటి కోచింగ్ కేంద్రాలకు పేరుగాంచిన నగరాల్లో, 2025లోనే ఇప్పటివరకు 22 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం ఈ సమస్య తీవ్రతకు నిదర్శనం అని మరొక అధ్యయన బ్నివేదిక తెలియజేస్తోంది. ఈ సంఖ్యలు కేవలం గణాంకాలు మాత్రమే కాదు, మన వ్యవస్థలో లోతైన చీలికను సూచిస్తున్నాయి.గత రెండు మూడు సంవత్సరాల కాలంలో కొన్ని విద్యా కేంద్రాలలో వెలుగులోకి వచ్చిన విషాద ఘటనలు మన విద్యా వ్యవస్థలోని లోపాలను స్పష్టంగా బహిర్గతం చేస్తున్నాయి. తల్లిదండ్రుల అపరిమితమైన అంచనాలు, కేవలం మార్కులనే కొలమానంగా పరిగణించే బోధనా విధానం, పరీక్షల పట్ల ఉండే భయం విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. వేల కోట్లతో వ్యాపారం చేస్తున్న కోచింగ్ సంస్థలు, కేవలం ర్యాంకులను సృష్టించే యంత్రాలుగా మారి, విద్యార్థుల మానసిక క్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయి. విజయం సాధించలేకపోయిన వారి వేదనను అర్థం చేసుకోవడంలో అవి ఘోరంగా విఫలమవుతున్నాయి. ఈ పోటీ ప్రపంచంలో ఒక చిన్న వైఫల్యం కూడా తమ జీవితానికి ముగింపు అని భావించేలా విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నాయి.విద్యాసంస్థలలో ప్రస్తుత వాతావరణం మరింత ఆందోళన కలిగిస్తోంది. కులం, మతం, ప్రాంతం వంటి అంశాలపై ఆధారపడిన వివక్ష, రేటింగ్‌ల ఆధారంగా కలిగే ఒత్తిడి, మానవీయ స్పర్శ లేని పాలనా వ్యవస్థ విద్యార్థుల్లో నిస్సహాయతను పెంచుతున్నాయి. ఐఐటీ మద్రాస్, ఐఐటీ బాంబే వంటి దేశంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థలు సైతం ఆత్మహత్యలకు వేదికలుగా మారడం విషాదకరం. ఇది వ్యవస్థాగత వివక్ష, అసమానతలు విద్యార్థులపై ఎంతటి ప్రభావం చూపుతాయో తెలియజేస్తోంది.ఈ విపత్కర పరిస్థితులలో, ప్రభుత్వం, విద్యా పాలనాధికారులు తక్షణమే మేల్కొనకపోతే, దేశ మానవ వనరులకు తీరని నష్టం వాటిల్లుతుంది. విద్యాసంస్థల్లో మానసిక ఆరోగ్య నిపుణులతో కూడిన కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ప్రతి విద్యార్థికి ఒక మార్గదర్శకుడిని (మెంటర్) కేటాయించడం తప్పనిసరి చేయాలి. కేవలం పరీక్షల ఫలితాలకే పరిమితం కాకుండా, వ్యక్తిత్వ వికాసం, సామాజిక స్పృహ, ఆత్మవిశ్వాసం వంటి అంశాలనూ విద్యా విలువలుగా పరిగణించాలి. విద్యార్థి ప్రతిభను కొలిచేటప్పుడు కేవలం మార్కులను కాకుండా, వారి సమగ్ర వికాసాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఐఐటీ ఢిల్లీ నియమించిన నిపుణుల కమిటీ నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. విద్యా వ్యవస్థలో మానవీయ విలువలను పెంపొందించే బోధనా పద్ధతులు, గురువులకు-శిష్యులకు మధ్య పరస్పర విశ్వాసంతో కూడిన సంబంధాలు అత్యంత అవసరం.విద్యార్థుల ఆత్మహత్యలు కేవలం గణాంకాలుగా మిగిలిపోకూడదు. ప్రతి విషాదం వెనుక ఒక కుటుంబం, ఒక సమాజం, ఒక దేశ భవిష్యత్తు నాశనమవుతున్నాయి. విద్య అంటే కేవలం జ్ఞానం సంపాదించడం మాత్రమే కాదు, జీవితాన్ని అర్థం చేసుకోవడానికి, ఎదుర్కోవడానికి అవసరమైన ధైర్యాన్ని అందించడం. ఈ విద్యా వ్యవస్థ తన ప్రాథమిక లక్ష్యాన్ని కోల్పోకుండా, విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని ఒక ప్రాథమిక హక్కుగా పరిగణించాల్సిన తరుణం ఆసన్నమైంది. ఈ మార్పు తక్షణమే రావాలి. ఈ నిశ్శబ్ద వేదనలను, మౌన మరణాలను సమాజం నిర్లక్ష్యం చేయడాన్ని అర్థం చేసుకోవడం కష్టం. తక్షణ స్పందన, సమగ్ర కార్యాచరణ ద్వారానే ఈ సమస్యను మనం పరిష్కరించగలం.

# దాశరథి రంగాచార్య గారి సతీమణి శ్రీమతి కమల గారి నిష్క్రమణ

**మిత్రులు ప్రముఖ కవి.. రచయిత జర్నలిస్ట్ దేశీ రాజ్ ద్వారా తెలిసింది. ఆమెకు గుడివాడ నుండి హృదయపూర్వక శ్రద్ధాంజలి**





మా పిల్లలను ఆ దంపతులిద్దరూ కలిసి దీవించిన రోజు తరగని తీపి గుర్తు. అప్పటికే రంగాచార్య గారు బెడ్ మీద ఉన్నారు. వారి వైద్యం విషయంలో నేను చొరవ తీసుకుని ముందుకు వెళ్తానంటే ఆయన "కర్మ అనుభవించిన గానీ తీరదు నాయనా.. నన్ను అనుభవించనీ" అన్నారు. వచ్చే జన్మకైనా కొంత కర్మ క్షాళన అవుతాను అన్నారు. ఆయన ధృడ వైఖరిని చూసి ఆశ్చర్య పోయాను. మా దంపతులం పిల్లలతో వారితో హైదరాబాద్ లో ఒక రోజంతా గడిపాం. ఎన్నో సాహిత్య సామాజిక ఆధ్యాత్మిక విషయాలు చర్చించుకున్నాం. శ్రీమతి కమల గారు ఆయనను కంటికి రెప్పలా కాపాడుతూ ఉన్నారు. అంధత్వం ఆయనను చుట్టుముట్టింది. ఆయన ఆరోగ్యం పై ఆ రోజంతా ఒప్పించాలని చూశాను. మహనీయులతో మాట్లాడించాను. అన్నీ మాట్లాడుతున్నారు గానీ ఔషధం మాత్రం అడగలేదు. అంత అంధత్వం లోనూ "నది" అనే పత్రికకు సీరియల్ రాస్తున్నారు. ఆయన ధృడ సంకల్పం విషయంలో... నేను ఆధ్యాత్మిక ధృతి, అవధి కనని శాంతిని స్వయంగా చూశాను. అలా ఉండగలిగితే...

**డా ఎమ్మెస్వీ సత్యనారాయణ బాబు (కపర్ది)**

24-9-2025

# తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్ లో దుబ్బాక వాసికి చోటు

**దుబ్బాక, సెప్టెంబర్ 24 (వార్తా ప్రభ)**, సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం గంభీర్పూర్ గ్రామానికి చెందిన డాక్టర్ అరిగి లోకేష్ ముదిరాజు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్ లోచోటు దక్కింది. వాట్సాప్ మాధ్యమంలో సైనిక గ్రూప్ ఏర్పాటు చేసి వాట్సాప్ మాధ్యమంలో 8,000 మందికి కోచింగ్ ఇస్తూ ఉచితంగా స్టడీ మెటీరియల్ ఉచితంగా ఫిజికల్ ట్రైనింగ్ ఇస్తూ 175 మంది అభ్యర్థులను వివిధ కేంద్ర బలగాలలో ఉద్యోగస్తులుగా తీర్చి దిద్దినందుకుగాను తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్లో అవకాశం కల్పించారు.

# పోలవరం - ఏలూరు కాలువ అనుసంధానానికి నిధులు మంజూరు చేయాలి : యార్లగడ్డ



గన్నవరం,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) : పోలవరం కుడికాలువ ను ఏలూరు కాలువతో అనుసంధానానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం జరిగిన సమావేశంలో యార్లగడ్డ మాట్లాడుతూ పోలవరం కుడి కాలువ నీరు ప్రకాశం బ్యారేజీ వరకు వెళ్లి తిరిగి ఏలూరు కాలువ ద్వారా బాపులపాడు మండలానికి రావడానికి సుమారు 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని, ఈ రెండు కాలువలను బాపులపాడు మండలంలో ని అంపాపురం వద్ద అనుసంధానం చేస్తే కాలువ చివరి గ్రామాలకు సాగునీటి కొరత తీరుతుందన్నారు. ఈ అనుసంధానానికి గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.15.60 కోట్ల నిధులు మంజూరు చేసినా వివిధ కారణాలతో పనులు ప్రారంభం కాలేదన్నారు. ఈ పనులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు. గత సంవత్సరం వచ్చిన వరదల కారణంగా బుడమేరు కు 39 చోట్ల గండ్లు పడితే వాటిని పూడ్చేందుకు రూ. 9 కోట్లు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. 2008వ సంవత్సరం నున్న గ్రామంలో 3.50 ఎకరాల భూమిని జర్నలిస్ట్ కాలనీ కి కేటాయించగా ఆక్రమణలపాలై ప్రస్తుతం 2.50 ఎకరాలు మాత్రమే ఉందని ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ కాలనీ లో జర్నలిస్టులకు ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పేద ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని జర్నలిస్టులకు ఒక సెంటు అదనంగా ఇవ్వాలని గత అసెంబ్లీ సమావేశాల్లో తన కోరగా స్పందించిన మంత్రి పార్థసారథి కమిటీని ఏర్పాటు చేశారని సాధ్యమైనంత త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని యార్లగడ్డ విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్ లో ప్రస్తావిస్తున్న అంశాలకు సంబంధించి ఎమ్మెల్యేలకు తిరుగు సమాచారం ఇవ్వటం లేదని దీనివల్ల తాము ప్రస్తావించిన అంశాలు ఏ స్టేజిలో ఉన్నాయో తెలుసుకునేందుకు వీలు లేకకుండాపోతుందన్నారు. జీరో వరకు తగిన ప్రాముఖ్యత నివ్వాలని ఎమ్మెల్యే లు లేవనెత్తిన సమస్యలపై అధికారులు సంబంధిత ఎమ్మెల్యేలకు సమాచారం ఇచ్చే విధంగా ఆదేశించాలని వెంకట్రావు సభాపతి స్థానంలో ఉన్న మండలి బుద్ధ ప్రసాద్ ను కోరారు.

# స్త్రీలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు సమాజం ఆరోగ్యంగా ఉంటుంది-డా. ప్రియాంక

## -మైలవరం గ్రామ సచివాలయాలు -2,4 పరిధి లో "స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్"



మైలవరం,సెప్టెంబరు 24 (వార్తాప్రభ): స్త్రీలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు సమాజం ఆరోగ్యంగా ఉంటుంది మైలవరం మండలంలోని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్. ప్రియాంక అన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్"కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అదుగుజాడల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో మైలవరం పట్టణంలోని గ్రామ సచివాలయం -2,గ్రామ సచివాలయం -4 పరిధిలో గ్రామ సర్పంచ్ మంజు భార్గవి సహకారంతో వివిధ ఆరోగ్య సమస్యలపై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ స్త్రీలందరూ రొమ్ము క్యాన్సర్ యొక్క స్క్రీనింగ్ మరియు గర్భాశయ ముఖద్వారా స్క్రీనింగ్ చేయించు కోవాలన్నారు. అలాగే కుక్క కాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.మైలవరం గ్రామ సర్పంచ్ మంజు భార్గవి , తెలుగు యువత అధ్యక్షులు లంకా లితీష్ తదితర నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం గ్రామంలో ఉన్న స్త్రీలు స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పీఎంజేవై రిజిస్ట్రేషన్ ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని,అలాగే ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో అందిస్తున్న ఆరోగ్య సేవలు గ్రామ ప్రజలు వినియోగించు కోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మైలవరం సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చారుగుండ్ల ప్రసాద్, బీజేపీ నాయకులు బి.వెంకట్రావు, కూటమి నాయకులు,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఏఎన్ఎమ్స్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, టాటా ట్రస్ట్ సిబ్బంది పీహెచ్ సి సిబ్బంది పాల్గొన్నారు.

# కరాటే లో రజిత పతకం విజేత అరవింద్ ను సత్కరించిన బూరగడ్డ



పెడన,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) : ప్రపంచ కరాటే ఆర్గనైజేషన్ జపాన్ రాజధాని టోక్యోలో జరిగిన పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొన్న క్రీడాకారుల్లో మచిలీపట్నం వాసి న్యాయవాది నున్న అరవింద్ రజిత పతకం సాధించారు.ఇండియాకి రజిత పతకం సాధించినందుకు బూరగడ్డ ఫౌండేషన్ తరపున బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బూరగడ్డ కిషన్ తేజ్ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.దేశ గౌరవాన్ని ఇనుమడింప చేసినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల నరసింహారావు ఇందూరి సీతారామయ్య ఇల్లూరి నాగబాబు బాబి పాల్గొన్నారు

# ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కు.. స్వాగతం పలికిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) : ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని శ్రీ కనకదుర్గమ్మ దర్శనం, విజయవాడ ఉత్సవ్ 2025 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొను నిమిత్తం.. బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ముందుగా ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు గవర్నర్ ను స్వాగతించారు. ఎమ్మెల్యే రాముతో పాటుగా ఏపీలోని మంత్రులు, ఉన్నతాధికారులు, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ కు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. విమానాశ్రయంలో పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన భద్రత బలగాల నడుమ ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గాన్న విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు



పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 24 (వార్తాప్రభ) : పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో మూడో రోజు అయిన బుధవారం అమ్మవారిని "అన్నపూర్ణాదేవి "గా అలంకరించి ఆలయ పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్తుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల్లో వర్ధిల్లాలని కోరుకుంటూ ఆలయ వేద పండితులు ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు, పిల్లాపాపలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పిల్లల ఆరోగ్యం, పోషకాహారాన్ని ప్రోత్సహించడానికే మాసోత్సవాలు



గుడివాడ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) : గుడివాడ అర్బన్ ఏరియా పరిధిలోని శ్రీరాంపురం, 9వ వార్డ్ల పరిధి లోని అంగన్‌వాడీ సెంటరులలో పోషణ మాసోత్సవాలలో భాగంగా పిల్లలకు ఆధునిక విద్య గురించి మరియు పిపి 1, పిపి 2 బుక్స్ గురించి తల్లులకు అవగాహన కలిగించారు. పిల్లలకు 5సం॥ లోపు బ్రెయిన్ డెవలప్‌మెంట్ 85శాతం అవుతుందని విశదీకరించారు. అలాగే 3సం॥ లోపు పిల్లలకు బాలామృతం వల్ల ఉపయోగాలు తెలియజేసారు. అలాగే 0 నుండి 06 మీ॥ పిల్లలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి కూడా వివరించారు. పై కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి (సి.డి.పి.ఓ) విజయ ఫ్లోరెన్స్, సూపర్‌వైజర్ జయంతిలు పాల్గొని ఆ ప్రాంతంలోని తల్లులకు అవగాహన కలిగించారు. అలాగే ఈ కార్యక్రమంలో ఏ ఎన్ ఎం దేవకి, అంగన్‌వాడి టీచర్లు మరియు హెల్పర్లు పాల్గొన్నారు.

# 45 సంవత్సరాల తరువాత కలుసుకునే అపూర్వ సమ్మేళనం



పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 24 (వార్తాప్రభ) : శ్రీ కాకాని వెంకటరత్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1949సంవత్సరం పెనుగంచిప్రోలు గ్రామం లో ప్రారంభంబించి ఉన్నారు. ఈ పాఠశాలలో 1979-80వ సంవత్సరం లో 10 వతరగతి చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు 45 సంవత్సరాల తరువాత కలుసుకునే అపూర్వ సమ్మేళనం, ఈ నెల 28 న మున్నేరు ఒడ్డున వున్న "నూతలపాటి కన్వెన్ హాల్" నందు జరుగునాని మన గెట్ టు గెదర్ కార్యక్రమాన్నీ జయప్రదం చేయాలని కె వి ఆర్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆహ్వాన కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ముందుగా ఆ చల్లని తల్లి శ్రీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి ని దర్శించుకుని,ఆ చదువుకున్న పాఠశాలకు వెళ్లి గత స్మృతులు నెమరి వేసుకుంటూ "గెట్ టు గెదర్" ని జయప్రదం చేయగలరని నిర్వాహకులు తెలిపారు.

# ఉప రాష్ట్రపతికి గన్నవరం ఎయిర్‌పోర్టులో సానా సతీష్ ఘన స్వాగతం



కాకినాడ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) : ఉపరాష్ట్రపతి సీ. వి. రాధాకృష్ణన్ బుధవారం విజయవాడ చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయంలో ఆయనకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, పలువురు ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసులు ఉప రాష్ట్రపతికి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన కనకదుర్గమ్మ దేవాలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ పున్నమి ఘాట్ వద్ద జరగనున్న విజయవాడ ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# గుడివాడ లో నవరాత్రి శోభ.. అన్నపూర్ణా దేవిగా దుర్గమ్మ




గుడివాడ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) : దసరా శరన్నవరాత్రులు సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాలలో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దర్శించుకుని ప్రత్యేక పూజాలు నిర్వహించి.. దర్శనాంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక పాటిమీద జగన్నాధపురం లో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వార్షిక శ్రీ రాజ్యలక్ష్మి శరన్నవరాత్రి మహోత్సవములలో భాగముగా బుధవారం శ్రీ ధైర్య లక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక స్వామి శ్రీ వేదాంతం అప్పలచార్యులు మాట్లాడుతూ శ్రీ అమ్మ వారు తమ భక్తులు కార్యసిద్ధి కొరకు ధైర్యం కలుగ జేయుట కొరకు ఈ రోజు ధైర్యలక్ష్మి అలంకారములో దర్శనం కలుగ జెస్తున్నారని గుడివాడ పట్టణ ప్రజలు శ్రీ అమ్మవారిని దర్శించుకొని పునీతులు కావలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ కందుల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో.. :** గుడివాడ పట్టణంలో ప్రసిద్ధిగాంచిన బంటుమిల్లి రోడ్డు లోని శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల మూడో రోజు శ్రీ అన్నపూర్ణాదేవి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి వేద పండితులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల నాలుగో రోజు గురువారం శ్రీ గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని దేవస్థానం ఈఓ కందుల గోపాలరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు పట్టపు చిన్నా తెలియజేశారు. 26వ తేదీ శుక్రవారం దేవస్థాన ప్రాంగణంలో శ్రీ చండీ హెూమ పూజలు నిర్వహిస్తున్నట్లు ఈవో గోపాలరావు తెలియచేశారు.

**శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో.. :** శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల మూడో రోజు శ్రీ అన్నపూర్ణదేవి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి వేద పండితులు పునీత్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల నాలుగో రోజు గురువారం శ్రీ గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు హరిబాబు, ఈవో గంగు శిరీష తెలియజేశారు. ఉత్సవ వేడుకలను దేవస్థాన ధర్మకర్తల కమిటీ సభ్యులు డి మహాలక్ష్మి, కే ప్రభు, ఎం రాముడు, బి శ్రీదేవి, ఏ విజయ కుమారి, బి జయలక్ష్మి పర్యవేక్షించారు.

**శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో.. :** ఏడవ వార్డు కొత్తపేటలోని శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో ఉత్సవాల మూడో రోజు శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారి భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు వటెం హేమంత రవికుమార్ శాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ వేడుకల్లో శ్రీ విజయ దుర్గ ఆలయ కమిటీ సభ్యులు, కొత్తపేట యూత్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**శ్రీశ్రీశ్రీ వడ్డపోలమాంబ అమ్మవారి దేవస్థానంలో.. :** పెద్దవీధి 8వ వార్డు లో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ వడ్డపోలమాంబ అమ్మవారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 3వ రోజు అమ్మవారిని శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవి అవతారంగా ప్రజలకు భక్తులకు దర్శనాన్ని కల్పించారు. ఈ పూజాది కార్యక్రమాల్లో కాకి శ్రీను లక్ష్మీ దంపతులచే అమ్మవారికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడి నిర్వాహకురాలు ధనాల సత్తమ్మ, దానాల వెంకట రత్నారావు లక్ష్మి, డాక్టర్ శ్రీను మరియు వార్డు ప్రముఖులు, భక్తులు పాల్గొని అమ్మవారి కరుణాకటాక్ష కృపకు పాత్రులయ్యారు. గౌరీశంకరస్వామి వారి ఆలయంలో శ్రీ అన్నపూర్ణదేవీగాను భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ నెరుసు సుభాష్ చంద్రబోస్, ట్రస్టీలు మరియు కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పాత గుడివాడ -కాకర్ల వీధిలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానములో శ్రీ అమ్మవారు శ్రీ రాజ్యలక్ష్మీదేవి గా భక్తులకు దర్శనం ఇచ్చింది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పై కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ అంగడాల సత్యప్రసాద్ (సతీష్), ట్రస్టీలు మరియు కార్యనిర్వహణాధికారి కె.వి.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. పిన్నమనేని నగర్, నక్కల కాలువ రోడ్ నాగ దుర్గమ్మ ఆలయంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

# అధికారుల నిర్లక్ష్యాన్ని అసెంబ్లీ వేదికగా ఎండగట్టిన ఎమ్మెల్యే వెనిగండ్ల..

## ●ఇరిగేషన్ ఈస్ట్ కృష్ణా డివిజన్ ఆఫీస్.. ట్రాన్స్ పోర్ట్ వాహనాల ఏ.టి.ఎస్.. ఇబ్బందులను అసెంబ్లీ క్వశ్చన్ అవర్లో లో ప్రస్తావించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) : కొందరి అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రజలు కష్టపడుతున్నారు.. చిత్తశుద్ధి లేని అధికారుల కారణంగా సీఎం చంద్రబాబు ఆశయాలకు అవంతరాలు కలుగుతున్నాయి.. రాష్ట్రం మొత్తం సమగ్ర అభివృద్ధి చెందాలనదే సీఎం నారా చంద్రబాబు ఆకాంక్ష అని.. అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేస్తున్నారు. ఐతే సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే కొంతమంది చిత్తశుద్ధి లేని అధికారుల వల్ల ప్రజలకు ఇబ్బందులు.. అభివృద్ధికి దూరంగా ఉండాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఎన్నిసార్లు విన్నవించిన అధికారుల నిర్లక్ష్యంతో అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదు.. గుడివాడను ఉదాహరణగా తీసుకుంటే ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కృష్ణ ఈస్ట్ డివిజన్ కార్యాలయం గుడివాడ ప్రధాన కేంద్రంగా పనిచేయాలి. ఐతే ఈస్ట్ డివిజన్ కార్యాలయాన్ని గుడివాడ తరలించేందుకు భవనాల నిర్మాణం పూర్తి చేసుకున్న కుంటి సాకులు చెబుతూ కాలం వెళ్ళబుచుతున్నారు. స్థానికంగా కార్యాలయం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదేవిధంగా వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇవ్వడానికి ఏ.టి.ఎస్. అనే కొత్త విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ క్రమంలో జిల్లా వాసులందరికీ దూరంగా మచిలీపట్నం దాటిన తర్వాత ఏ.టి.ఎస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వాహనదారులు చిన్నచిన్న సమస్యలకు 70 కిలోమీటర్ల దూరం వెళ్లి ఫిట్నెస్ చేయించుకోలేక నాన్న అవస్థలు పడుతున్నారు. ఏటిఎస్ కార్యాలయాన్ని జిల్లా నడిబొడ్డున ఉన్న గుడివాడలో ఏర్పాటు చేయడం వల్ల అన్ని ప్రాంతాల వారికి అందుబాటులో ఉంటుంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వారు కనీసం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను తెలిపిన అంశాలను పరిగణలోకి తీసుకొని పరిష్కరించాలని సభా వేదికగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు.

# ఘనంగా ఎన్.ఎస్.ఎస్. డే వేడుకలు



గుడివాడ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) : స్థానిక గౌరీశంకర పురం లో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. డే వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గుడివాడ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ యలమంచలి నాగేశ్వరరావు విచ్చేసినారు. ఈ కార్యక్రమము లో కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. రవీంద్ర బాబు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుతున్న నేటి యువతకు చదువు, విజ్ఞానంతో పాటు సమాజం పట్ల బాధ్యత, సేవా గుణం పెంపొందాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ జాతీయ సేవా పథకాన్ని ఎన్.ఎస్.ఎస్. అని పిలుస్తారని ప్రతి విద్యార్థి దీనిలో భాగస్వాములు కావాలని తెలియజేసినారు. ఎన్.ఎస్.ఎస్. పి.ఓ. సతీష్ చంద్ర ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లను ఉద్దేశించి ఎన్.ఎస్.ఎస్. నినాదం "నాట్ మీ బట్ యు" ఎన్.ఎస్.ఎస్. తత్వశాస్త్రాన్ని చెపుతుంది. ప్రతి వ్యక్తి సంక్షేమం సమాజ శ్రేయస్సుపై ఆధారపడి ఉంటుంది, కాబట్టి ప్రతి వాలంటీర్ సమాజ అభివృద్ధికి పాటుపడాలని హితవు పలికినారు. ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ జి.జీవన్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి వాలంటీర్ తప్పనిసరిగా ఒక విద్యా సంవత్సరంలో 120 గంటల సామాజిక సేవను పూర్తి చేయాలి. సంఘంతో వారి సంబంధాలను అర్థం చేసుకోవడానికి, సమాజం అభివృద్ధి పట్ల బలమైన బాధ్యతను పెంపొందించడానికి, సమాజ సేవ ద్వారా ప్రతి వాలంటీర్ వ్యక్తిత్వ వికాసాన్ని లక్ష్యంగా చేసుకునే కార్యక్రమమే ఈ ఎన్.ఎస్.ఎస్. అని పలికినారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ మరియు వ్యాసరచన పోటీలను నిర్వహించినారు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ వై. నాగేశ్వర రావుని ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ సన్మానించినారు. ఈ కార్యక్రమము లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అలియా బేగం, కామర్స్ అధ్యాపకులు కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ డా॥ సుగుణ, అకాడమిక్ డైరెక్టర్ డా॥ బి.ఇ.వి.ఎల్ నాయుడు లు అభినందనలు తెలియచేసినారు.

# కొనకంచి గ్రామం లో ఉచిత నేత్ర వైద్య శిబిరం



పెనుగంచిప్రోలు,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) : ఆరోగ్యమే మహాభాగ్యం మంటూ జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో కొనకంచి గ్రామంలో బుదవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించటం జరిగింది. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి సమాజమంతా ఆనందంగా ఉండాలి, అనే ఉన్నత ఆశయంతో, విలువలతో కూడిన వైద్య సేవలు అందించుచున్న జయప్రద ఫౌండేషన్ ఈరోజు నిర్వహించిన వైద్య శిబిరంలో మొత్తం 402 మంది వైద్య సేవలు పొంది ఉన్నారు.వారిలో కంటి వైద్య సేవలు పొందిన వారు 320 మంది.కంటి లోపం లు ఉండి కళ్ళజోడులు అవసరమైన వారు 190 మంది.మరియు చూపు మందగించి శుక్లముల ఆపరేషన్ కొరకు గుర్తించినది 87 మంది, పొరలు ఉన్నవారు ఆరుగురు, వీరందరికి త్వరలో శంకర్ చికిత్స నేత్రాలయం విజయవాడవారి వద్ద ఆపరేషన్ చేయించబడునని నిర్వాహకులు తెలిపారు. అలాగే జనరల్ వైద్య సేవలు పొందినవారు 82 మంది, షుగరు, రక్త, బీపీ, పరీక్షలు 402 మందికి చేయబడి,అవసరమైన వారందరికీ ఉచితంగా మందులు అందించబడినవి.కళ్ళజోడులు అవసరమైన190 మందికి త్వరలో జయప్రద ఫౌండేషన్ వారి ద్వారా కళ్ళజోడులు అందజేయబడునని ఫౌండేషన్ మేనేజమెంట్ కార్యదర్శి కట్టా నరసింహారావు తెలియజేశారు. ఈనాటి శిబిరంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వివో ఏ లు, గ్రామంలో వివిధ హెూదాల్లో ఉన్న నాయకులు నెట్టెం దుర్గ భవాని, సామినేని రంగారావు, కసుకుర్తి దశరథ రామారావు, షేక్ కాలం సాహెబ్ ,కాకుమాను వెంకట నరేష్ ,ఎర్రం భాస్కరరావు, మాదల రామకృష్ణ,మాజీ సర్పంచ్ కాసాని శ్రీనివాసరావు, కాకుమాను జగదీష్, లంజపల్లిసాగర్,నార్ని శ్రీనివాసరావు, పాలంకి పార్థసారథి, స్వామినేని రామకృష్ణ, కన్నీటి పద్మజ,గజ్జి సుదర్శన్ , తదితరులు పాల్గొని సేవలు అందించి ఉన్నారు. వీరందరికీ జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ధన్యవాదాలు తెలిపారు.

# నిండు గర్భిణీ కడుపు 'కోత'ల్ని ముందుగానే అక్షరబద్ధం చేసిన రచయిత, జర్నలిస్టు-యేమినేని

- 'రమణీయం' శీర్షికలో 2023లోనే ముద్రించిన నవమల్లెతీగ మాసపత్రిక
- ఈ సంవత్సరం ఆగస్టులో పుస్తకంగా ముద్రించి ఆవిష్కరించిన రచయిత
- ఆ విషయంపై మంగళవారం అసెంబ్లీలో ప్రస్తావించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

**విజయవాడ పశ్చిమ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** "రాష్ట్రంలో 52 శాతం నుండి 62 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయి. ఇందులో 90 శాతం ప్రైవేటు ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయి. డెలివరీ టేట్ ముందే చెబుతున్నారు. ముహూర్తాలు పెడుతున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి. డాక్టర్లు డబ్బుల కోసం సిజేరియన్ ను ప్రోత్సహిస్తున్నారు. దేవుడిచ్చిన సహజసిద్ధ శరీరాన్ని కోయడం సరికాదు. సాధారణ డెలివరీలనే ప్రోత్సహించాలి" మంగళవారం అసెంబ్లీలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ అంశంపై సీనియర్ జర్నలిస్టు, కాలమిస్టు యేమినేని వెంకటరమణ నవమల్లెతీగ మాసపత్రికలో నిర్వహిస్తున్న 'రమణీయం' శీర్షికలో 2023 ఆగస్టు సంచికలో పూర్తి వివరాలతో ఒక మంచి వ్యాసం రాశారు. రమణీయం శీర్షికలో ఆయన రాసిన వ్యాసాలన్నీ కలిపి 'రమణీయం' పుస్తకంగా ముద్రించి, 2025 ఆగస్టు 2న విజయవాడలో ఆవిష్కరించారు. జర్నలిస్టుకు ఎంత ముందుచూపు వుంటుందో ఈ వ్యాసమే నిదర్శనమని పలువురు పాఠకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రమణీయం
యేమినేని వెంకటరమణ, 98483 62588
శుభఘడియల కాన్పు కోసం నిండుచూలాలు కడుపుకోత

# దసరా కానుకగా కనీసం రెండు డిఏలను ఇవ్వండి

- తక్షణమే పి.ఆర్.సి. కమిషనర్ నియామకం చేపట్టాలి...
- ఉద్యోగుల అసంతృప్తి అర్థం చేసుకోండి.
- ప్రభుత్వ స్పందన లేకపోతే ఉద్యోగ సంఘాలకు ప్రత్యామ్నాయ మార్గమే శరణ్యం
- ఏపీ జేఏసీ చైర్మన్, ఎ. విద్యాసాగర్, (ఏపీఎన్జీజీవో) సెక్రెటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్, (యుటిఎఫ్)




**విజయవాడ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** రాష్ట్ర పురోభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పరిశ్రమలు, సాంకేతిక రంగాల అభివృద్ధి వంటి అంశాల్లో ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని, అయితే వారి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని ఏపీ ఎన్జీజివో జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్ లోని ఏపీ ఎన్జీ జిఒ హోమ్ లో బుధవారం జరిగిన పత్రికా సమావేశం లో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. దసరా కానుకగా కనీసం రెండు డి.ఎ.లను ఉద్యోగులకు ఇచ్చేలా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు అనేక విధాల నష్టపోయారని, ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వానికి ఏడాదిన్నర కాలం సహకరించినప్పటికీ సమస్యలు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు ?27,000 కోట్ల బకాయిలు ఉంచిందన్నారు. నూతన ప్రభుత్వం కొంత బకాయలు చెల్లింపు జరిపినప్పటికి ఉద్యోగులకు సంబంధించిన సమస్యల్లో సింహభాగం అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం నాలుగు డి.ఏలు పెండింగ్లో ఉండగా తక్షణమే దసరా పండుగకు డి.ఎ. ప్రకటించి ఉద్యోగులకు తాత్కాలిక ఉపసమనం కల్పించాలన్నారు. ఉద్యోగుల వేతనాలపై నియమించాల్సిన పిఆర్సి కమిషన్ కాలపరిమితి 25 నెలల కాలం జరిగినప్పటికీ పి.ఆర్.సి కమిషనర్ ని నియమించకపోవడం శోచనీయమని, ఇంతవరకు రాష్ట్ర చరిత్రలో ఇటువంటి సందర్భం తలెత్తలేదన్నారు. ఎప్పుడైనా పిఆర్సి ఫిట్మెంట్ కోసం పోరాడిన సందర్భాలు ఉన్నాయి, కానీ పిఆర్సి కమిటీ కోసం పోరాడాల్సిన పరిస్థితి ఇంతవరకు లేదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కనీసం ఆర్థికేతర ఇబ్బందులు లేని హెల్త్ కార్డులను సక్రమంగా వినియోగించుకునే పరిస్థితి లేదన్నారు. వైద్య సేవలు సక్రమంగా అందడం గగనంగా మారిందన్నారు. ఉద్యోగులు ప్రతి నెల 300 రూపాయలు కడుతున్నప్పటికీ వైద్య సేవలు ఎన్ని సంవత్సరాలైనా అందకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేసారు. ముఖ్యంగా పదవీ విరమణ చేస్తున్న వారి పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని, పదవి విరమణ చేసి నాలుగు సంవత్సరాల అయినా కూడా చెల్లింపులు జరగకపోవడం శోచనీయమని, గ్రాటిట్యూటీ విషయంలో సరెండర్ లెవెల్ విషయంలో మిగిలిన వాటి విషయంలో ఉద్యోగులతో పాటు పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులు కూడా తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వారికి రావలసిన వాటిని అన్న వారికి జమ అయ్యేటట్లు చూడాలని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నామన్నారు. ఇలాంటి అంశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎంతో అనుభవం ఉందన్నారు. ప్రభుత్వానికి నిర్మాణాత్మక సహకారాన్ని అందిస్తున్నామని, ప్రభుత్వం కూడా పరిస్థితి అర్థం చేసుకుని ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు.ఏపీ జెఏసి సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కరోనా సమయంలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు పంచాయతీ రాజ్ శాఖలో కూడా అమలు చేయాలన్నారు. దసరా పండుగను నిజమైన పండుగగా ఉద్యోగులు జరుపుకునేట్లు చూడాలని కోరారు. ఏపీ జెఏసి ద్వారా ఉద్యోగులకు మరింతగా సేవలందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల మండలాల జేఏసీల్ని అక్టోబర్ నెలలో పునర్వ్యవస్థీకరిస్తున్నామన్నారు. అక్టోబర్ నాటికి నూతన జేఏసీ కమిటీలు ఏర్పడతాయని తెలిపారు. అక్టోబర్ నెలకి జేఏసీ రాష్ట్రస్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల మీద ముందుకు రాని పక్షంలో ఏపీ జెఏసి ముందు వేరే ప్రత్యామ్నాయం ఏమీ లేదని పోరాటమే ప్రత్యామ్నాయమన్నారు. కార్మిక పని గంటల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన బిల్లు ఉద్యోగులను కార్మికులను ఇబ్బంది పెడుతుందని, యాజమాన్యాలు మరింత దూకుడుగా వ్యవహరిస్తాయని, కనుక పని గంటల పెంపు విధానాన్ని ఏపీ జెఏసి వ్యతిరేకిస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రధానంగా నూతన పి.ఆర్.సి కమిషనర్ నియామకం,పెండింగ్ డి.ఏల విడుదల అంశంలో కార్యాచరణ, ఉద్యోగుల బకాయిలను వేగవంతంగా చెల్లించేందుకు స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. క్వాంటం పెన్షన్ విధానంలో మార్పులు చేసి పెన్షనర్లకు న్యాయం చేయడంతో పాటు ఉద్యోగుల హెల్త్ కార్డులు అమలు అయ్యే విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న కీలక పోస్టులను త్వరగా భర్తీ చేయడంతో పాటు గత ప్రభుత్వం తెచ్చిన యాక్ట్ 30 లో భాగంగా మిగిలిన ?7,000 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్ల కల్పన, ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల పాఠశాలల వయో పరిమితిని 62 సంవత్సరాలకు పెంపు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలలో అర్హులుగా చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీఎన్జీజీవో ప్రధాన కార్యదర్శి డి.వి రమణ, జేఏసీ సంఘాల నేతలు డి. వెంకటేశ్వర్లు (రాష్ట్ర పెన్షనర్ల సంఘం), రఘునాథరెడ్డి (ఎస్ టి యు), జి. హృదయ రాజు (ఏపీటీఎఫ్1938), సిహెచ్. మంజుల (ఏపీటీఎఫ్ 257), బండి శ్రీనివాసరావు (ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్), ఎన్. చంద్రశేఖర్ (నాలుగవ తరగతి ఉద్యోగుల రాష్ట్ర సంఘం),యం. కృష్ణ ప్రసాద్, ఏపి.రిజిస్ట్రేషన్ & స్టాంప్స్ డిపార్టుమెంటు ఎంప్లాయిస్ అసోసియేషన్, పాము శ్రీనివాసరావు (రాష్ట్ర ఖజానా ఉద్యోగుల సంఘం), పి. రమేష్ (ఏపీ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఎన్జీవోస్ అసోసియేషన్), వైవిడి. ప్రసాద్ (ఏపీ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్), బి. జానకి, (ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్), వేణు మాధవరావు (ఏపీ అగ్రికల్చరల్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్స్ అసోసియేషన్), టి. కృష్ణ కిషోర్ (ఏపీ ఐటిఐ అండ్ డి ఎల్ టి సి స్టాఫ్ అసోసియేషన్), ఆర్.బి. పెద్దిరాజు (ఏపీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్), ఎస్.ఎస్.ఎల్. సోమయాజులు (ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్), వి. కృష్ణ (ఏపీ వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల సంఘం), షేక్ మహమ్మద్ జానీ పాషా (గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం), సి. మరియదాసు తదితరులతో సహా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఘన స్వాగతం

(గౌరీ శంకర్)

**గన్నవరం,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న భారత ఉపరాష్ట్రపతి దంపతులు సీపీ రాధాకృష్ణన్, ఆర్ సుమతి లకు రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి సతీమణి నారా భువనేశ్వరి ఘన స్వాగతం పలికారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని శ్రీ కనకదుర్గమ్మ దర్శనం, విజయవాడ ఉత్సవ్ 2025 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొను నిమిత్తం గన్నవరం చేరుకున్న ఉపరాష్ట్రపతికి రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్, కృష్ణా జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా, ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, రాజ్యసభ సభ్యులు సాన సతీష్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు కృష్ణ ప్రసాద్ తెన్నేటి, పెనమలూరు, గుడివాడ, పామర్రు, పెడన, కైకలూరు నియోజకవర్గాల శాసనసభ్యులు బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్, డాక్టర్ కామినేని శ్రీనివాసరావు, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు భారత ఉపరాష్ట్రపతికి ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయంలో పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన భద్రత బలగాల నడుమ ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గాన్న విజయవాడకు బయలుదేరి వెళ్లారు.



# ఘనంగా జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు










**గుంటూరు,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** స్థానిక టి జె పి యస్ కళాశాల లో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వర శాస్త్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్వదీప్తి తేరా (అడ్వకెట్ హై కోర్ట్ ) మరియు గౌరవ అతిధి గా డాక్టర్ చలపతి (ఆస్ట్రేలియన్ డెంటల్ హాస్పిటల్ ) విచ్చేశారు.ముఖ్య అతిధిగారు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యతో మాత్రమే కాకుండా వివిధ సేవా కార్యక్రమాల లో పాల్గొనడం చాలా సంతోషకరమని, మహాత్మా గాంధీ గారి కన్న కలలను సాకారం చేసే బాధ్యత ప్రతి ఒక్క యన్ యస్ యస్ వాలంటీర్ తీసుకోవాలని చెప్పారు. అంతే కాకుండా మానవ జీవితం లో ఆత్మ సంతృప్తి చాలా ముఖ్యమని గురజాడ అప్పారావు చెప్పిన మాటలలో "సొంత లాభం కొంత మానుకు పొరుగువానికి తోడు పడవోయ్" అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. గౌరవ అతిధిగా విచ్చేసిన డాక్టర్ చలపతి (ఆస్ట్రేలియన్ డెంటల్ హాస్పిటల్) గారు మాట్లాడుతూ మానవ శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే చక్కటి ఆహారం మనం ఏవిదంగా తీసుకుంటామో,సమాజం చక్కగా, సంతోషం గా ఉండాలంటే మన వంతు పాత్ర కూడా ఉండాలని, ముఖ్యం గా ప్రకృతిని కాపాడటంలో యువత బాధ్యత తీసుకోవాలని చెప్పారు. మరొక గౌరవ అతిధిగా విచ్చేసిన టి శ్రీనివాసరావు (అడ్వకెట్, సుప్రీం కోర్ట్ ) మాట్లాడుతూ యన్ యస్ యస్ ద్వారా నాయకత్వ లక్షణాలు, స్వతహాగా జీవితాలలో ముందుకు వెళ్లే శక్తిని సంపాదించవచ్చునని, మనకి ఉన్నదాంట్లో కొంత సమాజానికి తప్పకుండా వినియోగించాలని, యూనివర్సిటీ, రాష్ట్ర, జాతీయ స్థాయిలో యన్ యస్ యస్ పురస్కారాలు ఉంటాయని,వాటిని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం యన్ యస్ యస్ వాలెంటర్స్ కి ముఖ్య , గౌరవ అతిథిలు, ప్రిన్సిపాల్స్ చేతులమీదుగా ఉత్తమ యన్ యస్ యస్ పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందించారు.యన్ యస్ యస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు ఏర్పాటు చేసిన పోటీలలో విజేతలకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమం లో కళాశాల పి జి ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ అనితా దేవి, గుంటూరు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జె వి సుధీర్ కుమార్, కళాశాల యన్ యస్ యస్ అధికారి ఆర్ జయశైలజ మరియు వాలెంటర్స్ పాల్గొన్నారు.బెస్ట్ వాలెంటర్స్ పురస్కారాలు పొందిన యన్ యస్ యస్ వాలెంటర్లు అందరికీ కళాశాల అధ్యక్షులు పోలిశెట్టి శ్యాం సుందర్, సెక్రటరీ మరియు కరస్పాండంట్ కె వి బ్రహ్మం అభినందనలు తెలిపారు.

# కోతకు గురవుతున్న పాత ఎడ్లంక గ్రామాన్ని పరిరక్షించాలి

**-ఎడ్లంక రక్షణ చర్యలపై అసెంబ్లీలో ప్రస్తావించినఅవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**




**అవనిగడ్డ,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** కృష్ణానది వరదలతో కోతకు గురవుతున్న పాత ఎడ్లంక గ్రామాన్ని పరిరక్షించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల జీరో అవర్ సమయంలో ఆయన అవనిగడ్డ మండలం పాత ఎడ్లంక దీవి గ్రామం ఎదుర్కొంటున్న కోత సమస్యను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల కృష్ణానదికి వరదలు తీవ్రంగా రావటంతో పాటు, నదీ గమనంలో మార్పు రావటంతో ఎడ్లంక గ్రామం తీవ్రంగా కోతకు గురి అవుతూ వచ్చిందన్నారు. చాలా ఇళ్ళు కూలిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. గ్రామంలోని చాలా భాగం లోపలికి కృష్ణానది చొచ్చుకువచ్చిందని తెలిపారు. గతంలో నది కోత కారణంగా కొన్ని ఇళ్ళు నదిలో కలిసిపోగా, తాజా వరదలతో మంగళవారం నాలుగు ఇళ్ళు నదిలో కలిసిపోయినట్లు తెలిపారు. ఆ గ్రామాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రత్యేకించి కృష్ణానది వరదల కారణంగా ఎడ్లంక దీవి కోతకు గురవుతున్న ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వరదలు వచ్చిన సమయంలో దీవి వాసులు రాకపోకలు సాగించటం కష్టసాధ్యంగా ఉందని, దీవి వాసులు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు వంతెన నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎడ్లంక దీవిలో నివసించే ప్రజలందరూ నిరుపేద ఎస్సీ, బీసీ వర్గాల వారు అత్యధికముగా జీవిస్తున్నారని తెలిపారు. ఎడ్లంక దీవి ప్రజలు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందుల్లో, తీవ్ర ఆవేదనలో ఉన్నారని తెలిపారు. అక్కడి ప్రజల ఆవేదన గమనించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కోరారు.

# ఇరువురు రోగులకు వైద్యచికిత్స నిమిత్తం రూ. 3.50లక్షలు మంజూరు

**గన్నవరం,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గంలోని ఇరువురు రోగులకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ రూ. 3.5లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయించారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామానికి చెందిన బేవర కుమారికి రెండు లక్షలు, గన్నవరం మండలం చిక్కవరం గ్రామానికి చెందిన బుద్ధాల రామదాసు కు రూ. 1.5లక్షలు ఎల్ఓసి లను బుధవారం సాయంత్రం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో రోగుల కుటుంబ సభ్యులకు యార్లగడ్డ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. గన్నవరం నియోజవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అత్యధికంగా నిధులు తీసుకొచ్చి ఎక్కువ మంది రోగులకు ఆర్థిక సాయం అందించినట్లు ఈ సందర్భంగా యార్లగడ్డ వివరించారు.



# కీర్తిశేషులు మూడవత్ రవి నాయక్ కు బీసీ నేత "భేరి" ఘన నివాళి



**హైదరాబాద్,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** గచ్చిబౌలి డివిజన్, నేతాజీ నగర్ కాలనీలో కీర్తిశేషులు మూడవత్ రవి నాయక్ దశదినకర్మ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవి నాయక్ చాలా మంచి వ్యక్తి అని, సుగుణాలు కలవాడని అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఉండేవాడని అన్నారు. మంచి వాళ్ళకే తొందరగా చావు వస్తుందనేది నిజమైతే అది రవి నాయక్ విషయంలో నూటికి నూరుపాలు నిజమని అన్నారు. ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రవి నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని ఆ భగవంతున్ని మనసారా కోరుకుంటున్నానని అన్నారు ఈ కార్యక్రమంలో కాలు ఉపాధ్యక్షులు రాయుడు, లక్ష్మారెడ్డి, రవి నాయక్, గణేష్ నాయక్, రాజు నాయక్, సాయి నాయక్ , మూడవ త్ కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రద్ధాంజలి తెలిపారు

# ఆధ్యాత్మిక కళతో శ్రీ కొండలమ్మ సన్నిధి...




**గుడ్లవల్లేరు,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం దసరా నవరాత్రుల్ని పురస్కరించుకుని బుధవారం ఆధ్యాత్మిక కళతో నిండిపోయింది. శ్రీ అమ్మవారికి సహస్రనామార్చన, సమస్త వ్యవసాయాభివద్ధి, వ్యాపారాభివద్ధికి, శ్రీ సుదర్శన, రుద్ర, మూల మంత్ర హవనములను వేద మంత్రోచ్చరణ నడుమ వేద పండితులు నిర్వహించారు. శ్రీ అమ్మవారి దేవస్థానంలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, మాజీ సర్పంచి కొడాలి రామరాజు, దేవస్థాన సభ్యులు తూము రాజ్యలక్ష్మీ, గుడ్లవల్లేటి వాణి, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్ర బాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, ఎక్స్%-% అఫీషియో మెంబర్ శ్రీ రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ శర్మ సామూహిక కుంకుమ పూజ, హోమములో పాల్గొన్నారు.




పశ్చిమ గోదావరి జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును స్వాగతిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి మరియు జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు ఇంట వివాహ వేడుకలో పాల్గొన్న నారా చంద్రబాబు నాయుడు దంపతులతో కలెక్టర్ నాగరాణి ఉన్న దృశ్యం -పాలకొల్లు, సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :

# అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం

**కోదూరు,సెప్టెంబరు 24 (వార్తాప్రభ) :** కోదూరు గ్రామంలో వేంచేసి భక్తులచే విశేష పూజలు అందుకుంటున్న శ్రీ గంగానమ్మ ఆలయం నందు బుధవారం అన్న పూర్ణాదేవిగా గంగానమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. కాశీపురాధీశ్వరి భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరి అంటూ భక్తులు విశేష పూజలు నిర్వహించారు.అన్నపూర్ణ దేవి అంటే పూర్ణమైన ఆహారాన్ని కలిగించేదని ఆమె ఈతి బాధలు లేకుండా అన్నపానాదులకు లోటులేకుండా చేస్తుందని. ఆమెను శాంక రిగా, శంభుని ప్రియురాలిగా, కాశ్మీరవాసిని, కాశీనివాసిగా, త్రిపురేశ్వరిగా, త్రినయినిగా,విశ్వేశ్వరిగా కొలుస్తారని అర్చకులు వివరించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు పర్యవేక్షించారు.



Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188